

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 22-05-2026 | సంపుటి - 27 | సంచిక -359 | రూ : 4 | పేజీలు: 8

## ఎండదెబ్బ లక్షణాలు అస్సలు నిర్లక్ష్యం చేయకండి!



- ఆ ఉష్ణోగ్రతలు పెరిగితే వడదెబ్బ తగిలే ముప్పు
- అవయవాలు దెబ్బతినే ప్రమాదకర స్థితి
- గందరగోళం, అపస్మారక స్థితి
- సొంత వైద్యం చేయొద్దు
- తడిగుడ్డ, ఐస్‌తో శరీరాన్ని చల్లబర్చాలి

2లో



## మెలోనీకి మోదీ కానుకలు.. ప్రతి దాంట్లోనూ ప్రత్యేకత!

- భారతీయ వస్త్ర, కళా, సంగీత వారసత్వానికి ప్రతీకగా బహుమతులు
- ఇరు దేశాల మధ్య బంధాన్ని ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంపు
- 2029 నాటికి 20 బిలియన్ యూరోల వాణిజ్యమే లక్ష్యంగా ఒప్పందం

2లో

## ఎబోలా కలకలం.. భారత్-ఆఫ్రికా శిఖరాగ్ర సదస్సు వాయిదా!



- విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో చర్చించి నిర్ణయం
- ఆఫ్రికా కూటమితో సంప్రదింపులు
- డీఆర్‌సీ, ఉగాండాలో అంతర్జాతీయ హెల్త్ ఎమర్జెన్సీ

2లో

## ఎయిరిండియా ప్రయాణికులకు తప్పిన ముప్పు!

- బెంగళూరులో రన్‌వేను తాకిన విమానం తోక
- గాలి అలల ఉద్ధృతికి తప్పిన బ్యాలెన్స్
- ప్రయాణికులు సురక్షితం
- విమానం నిలిపివేత
- దర్యాప్తు ప్రారంభించిన డీజీసీఏ

2లో





## 'నీలీ' నీడ: 'అక్టోబర్ 7' హంతకులపై ఇజ్రాయెల్ హైటెక్ వేట!

- దాడిలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ వేటాడేందుకు ఇజ్రాయెల్ 'నీలీ' అనే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- హైటెక్నాలజీ, ఫేషియల్ రికగ్నిషన్, డిజిటల్ ఆధారాలతో అనుమానితుల గుర్తింపు

2లో

## కేటగిరీలుగా కార్మికులు

- అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ గా విభజన
- కోటి 11 లక్షల మందికి మేలు
- జూన్ 1 నుంచి పెంచిన కనీస వేతనాలు అమలు : విలేకర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్ : కార్మికుల కనీస వేతనాలపై తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కార్మికులను అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించామని తెలిపారు. తద్వారా మొత్తం కోటి 11 లక్షల మందికి లబ్ది చేకూరనుందని చెప్పారు. జూన్ 1 నుంచి ఈ నిర్ణయం అమలవుతుందని వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సీఎం మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కనీస వేతనాల విషయంలో రాష్ట్రంలోని కార్మికులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీని నియమించిందని గుర్తు చేశారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించిన ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుందని వివరించారు. రాష్ట్రంలోని జోన్లను మూడు భాగాలుగా విభజించామని తెలిపారు. జోన్ 1లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్ 2లో మున్సిపాలిటీలు, జోన్ 3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనాలను నిర్ణయించామని వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొట్టమొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయం ఇదని పేర్కొన్నారు. ఈ విషయంలో గత ప్రభుత్వం తన బాధ్యతను గాలికొదిలేసిందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించిందని చెప్పారు. కార్మిక నాయకుడైన వెంకటస్వామి వారసుడిగా మంత్రి వివేక్ మంచి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

అమెరికా ఆలోచనను వీడండి...

రాష్ట్రంలోని యువతకు సీఎం ఈ సందర్భంగా ఓ సూచన చేశారు. ఐటీ రంగంలో ఉండాలి, అమెరికా వెళ్లాలనే

తరువాయి 2లో

## భారత్‌కు ఎల్పీజీ కటకట

- రోజుకు 4 లక్షల బ్యారెళ్ల ఇంధన కొరత
- సగానికి పడిపోయిన దిగుమతులు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో రవాణా ఆలస్యం

న్యూఢిల్లీ : అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దేశీయంగా వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ జరిపిన దాడుల

తరువాయి 2లో





## రోబో సైన్యంతో రైల్వే స్టేషన్ నిర్మాణం

- 38 నెలల్లో చోంగ్‌కింగ్ రైల్వే స్టేషన్ ను నిర్మించిన చైనా

బీజింగ్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గత వారం చైనాను సందర్శించినప్పుడు, ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే అతి పెద్దదైన చోంగ్‌కింగ్ ఈస్ట్ రైల్వే స్టేషన్ నిర్మాణ ప్రయాణానికి సంబంధించిన ఒక వీడియోను ఎక్స్ లో రీపోస్ట్ చేశారు. మస్క్ ఆ పోస్ట్‌లో ఏమీ రాయనప్పటికీ, ఆయన ఆ పోస్ట్ ఎందుకు చేశారనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే, ఆయన గతంలో ప్రజా రవాణాపై ఓ సందేహాన్ని వ్యక్తం చేశారు.

తరువాయి 2లో

# భారత్‌కు ఎల్పీజీ కటకట

న్యూఢిల్లీ : అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దేశీయంగా వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ జరిపిన దాడుల అనంతరం ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి గుండా రాకపోకలు నిలిచిపోవడంతో భారతదేశంలో రోజుకు దాదాపు 4 లక్షల బ్యారెళ్ల ఎల్పీజీ కొరత ఏర్పడింది. ప్రముఖ విశ్లేషణాత్మక సంస్థ కెప్లర్ గణాంకాల ప్రకారం.. ఫిబ్రవరి నెలలో రోజుకు సగటున 8.5 లక్షల బ్యారెళ్లుగా ఉన్న దిగుమతులు.. ఏప్రిల్ నాటికి సగానికి పైగా పడిపోయి కేవలం 3.7 లక్షల బ్యారెళ్లకు పరిమితమయ్యాయి. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తి రోజుకు 75,000 బ్యారెళ్ల మేర పెంచినప్పటికీ.. దేశ అవసరాలకు అది ఏమాత్రం సరిపోవడం లేదు. భారత్ తన మొత్తం వంటగ్యాస్ అవసరాలలో మూడింట రెండు వంతులు దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో 80 శాతం సరఫరా యూఏఇ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా దేశాల నుంచే వస్తుంది. అయితే.. యుద్ధం కారణంగా అక్కడి ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు జరగడంతో, ఆయా ప్రధాన దేశాల నుంచి భారత్‌కు వచ్చే దిగుమతులు ఏకంగా 75 శాతం మేర పడిపోయాయి. ఇవి తిరిగి సాధారణ స్థితికి రావడానికి చాలా సమయం పట్టేలా కనిపిస్తోంది. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి భారతీయ ఇంధన సంస్థలు ఆస్ట్రేలియా, అర్జెంటీనా, అమెరికా వంటి ప్రత్యామ్నాయ దేశాల నుంచి ఎల్పీజీని కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే పశ్చిమాసియా దేశాల నుంచి భారత్‌కు రావడానికి కేవలం 5 నుంచి 6 రోజుల సమయం పడితే.. ఆస్ట్రేలియా నుంచి 20 రోజులు, అమెరికా లేదా అర్జెంటీనా నుంచి నౌకలు రావడానికి 35 నుంచి 45 రోజుల సుదీర్ఘ సమయం పడుతోంది. పైగా ఈ దేశాల నుంచి అందుతున్న ఇంధన పరిమాణం కూడా చాలా తక్కువగా ఉండటంతో మార్కెట్లో డిమాండ్‌కు తగ్గ సరఫరా సాధ్యం కావడం లేదు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పైప్డ్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్లను వేగంగా పెంచుతున్నప్పటికీ.. అది కేవలం 1.6 కోట్ల ఇండ్లకు మాత్రమే పరిమితమైంది. కానీ దేశంలో ఎల్పీజీ సిలిండర్లపై ఆధారపడే ఇండ్లు 33 కోట్లకు పైగా ఉన్నాయి. ఈ భారీ సరఫరా కొరత కారణంగానే ఈ నెల ప్రారంభంలో సిలిండర్‌పై ధరను ఏకంగా రూ.993 పెంచారు. ఫలితంగా బ్లాక్ మార్కెట్ దందా కూడా పెరిగింది. అధిక ధరలు ద్రవ్యోల్బణం ఎగిసిపడటానికి దారి తీస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## మెలోనీకి మోదీ కానుకలు..

# ప్రతి దాంట్లోనూ ప్రత్యేకత!

ప్రధాని నరేంద్ర మోదీ తన ఇటలీ పర్యటనలో భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని, కళా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాకు ఆయన అందించిన ప్రత్యేక కానుకలు ఇరు దేశాల మధ్య సాంస్కృతిక బంధాన్ని ప్రతిబింబించాయి. ఈ పర్యటనలో భాగంగా భారత్, ఇటలీ తమ ద్వైపాక్షిక సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుకున్నాయి.

**మెలోనీకి భారతీయ వస్త్ర కళావైభవం**

ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అస్సాంకు చెందిన ప్రఖ్యాత ముగా సిల్క్ శాలువా, మణిపూర్‌కు చెందిన శిరుయి లిల్లీ సిల్క్ శాలువాను బహుమతిగా అందించారు. అస్సాంలోని బ్రహ్మపుత్ర లోయలో మాత్రమే లభించే ముగా సిల్క్‌ను 'బంగారు పట్టు'గా పిలుస్తారు. ఎలాంటి కృత్రిమ రంగులు లేకుండా సహజసిద్ధమైన బంగారు వర్ణంలో మెరిసిపోయే ఈ పట్టుకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక, మణిపూర్‌లోని శిరుయి పర్వతాల్లో మాత్రమే పూసే అరుదైన శిరుయి లిల్లీ పువ్వు స్ఫూర్తితో రూపొందించిన శాలువాను కూడా మోదీ అందించారు. ఆసక్తికరంగా ఇటలీ సంస్కృతిలో కూడా లిల్లీ పువ్వుకు పవిత్రత, సౌందర్యానికి ప్రతీకగా ప్రత్యేక స్థానం ఉంది.

**అధ్యక్షుడికి కళా, సంగీత కానుకలు**

ఇటలీ అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాకు ఆగ్రా కళాకారుల నైపుణ్యానికి అద్దం పట్టే మార్బుల్ ఇన్లే వర్క్ బాక్స్‌ను మోదీ బహూకరించారు. 'పియత్రా దురా' లేదా 'పచ్చికారి'గా పిలిచే ఈ అద్భుతమైన కళ వాస్తవానికి ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో పుట్టి, మొఘలుల కాలంలో భారత్‌లో ప్రాచుర్యం పొందింది. ఈ కళాఖండం ఇరు దేశాల కళాత్మక బంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ బాక్స్‌లో సంగీత ప్రపంచంలో శిఖర సమానులైన భారతరత్న పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి ఆలపించిన గీతాల సీడీలను ఉంచి అందించారు.

**బలపడిన ద్వైపాక్షిక సంబంధాలు**

ఈ పర్యటనలో ఇరు దేశాలు పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. 2029 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ యూరోలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వ్యవసాయం, ఆర్థిక నేరాల నివారణ, భారత ఆరోగ్య నిపుణుల ఇటలీ వలస వంటి అంశాలపై ఒప్పందాలు జరిగాయి. ఇండియామిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ) పైనా చర్చలు జరిపారు. యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీలో ఐదు దేశాల పర్యటనను విజయవంతంగా ముగించుకుని ప్రధాని మోదీ తిరిగి స్వదేశానికి చేరుకున్నారు.

# కేటగిరీలుగా కార్మికులు

హైదరాబాద్ : కార్మికుల కనీస వేతనాలపై తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కార్మికులను అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించామని తెలిపారు. తద్వారా మొత్తం కోటి 11 లక్షల మందికి లబ్ధి చేకూరనుందని చెప్పారు. జూన్ 1 నుంచి ఈ నిర్ణయం అమలవుతుందని వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సీఎం మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కనీస వేతనాల విషయంలో రాష్ట్రంలోని కార్మికులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీని నియమించిందని గుర్తు చేశారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించిన ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుందని వివరించారు. రాష్ట్రంలోని జోన్లను మూడు భాగాలుగా విభజించామని తెలిపారు. జోన్ 1లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్ 2లో మున్సిపాలిటీలు, జోన్3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనాలను నిర్ణయించామని వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొట్టమొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయం ఇదని పేర్కొన్నారు. ఈ విషయంలో గత ప్రభుత్వం తన బాధ్యతను గాలికొదిలేసిందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించిందని చెప్పారు. కార్మిక నాయకుడైన వెంకటస్వామి వారసుడిగా మంత్రి వివేక్ మంచి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అమెరికా ఆలోచనను వీడండి... రాష్ట్రంలోని యువతకు సీఎం ఈ సందర్భంగా ఓ సూచన చేశారు. ఐటీ రంగంలో ఉండాలి, అమెరికా వెళ్లాలనే ఆలోచనలను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థమని వ్యాఖ్యానించారు. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలను అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, యువతను ప్రోత్సహిస్తోందని తెలిపారు.

**బీజేపీది రాజకీయ కోణం...**

ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజకీయ కోణంలోనే చూస్తోందని సీఎం విమర్శించారు. అంతేతప్ప వాటి పరిష్కారానికి ప్రయత్నించటం లేదని దుయ్యబట్టారు. అందుకే ఎన్నికలు కాగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తమ ప్రభుత్వం ప్రతీ అంశాన్ని దీర్ఘకాలిక దృష్టితోనే చూస్తోందని చెప్పారు. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపు పై నిర్ణయం తీసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయ్యిందని చెప్పారు. మిగతా ధాన్యాన్ని కూడా త్వరలోనే కొనుగోలు చేస్తామని హామీనిచ్చారు.

**బీఆర్ఎస్ వి శవరాజకీయాలు**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆ పార్టీ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల విషయంలో బీఆర్ఎస్ శవ రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా? అని ప్రశ్నించారు. రైతులపై ప్రతిపక్షాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్టు బీఆర్ఎస్ నేతలు శాడిస్టుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ కేసులో బండి భగీరథ్ ను పోలీసులే అరెస్టు చేశారని తెలిపారు. బండి సంజయ్ తన కుమారుడిని తానే అప్పగించానని చెబుతున్నారు.. కానీ ఇంట్లోనే ఎందుకు ఆ పని చేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి వాస్తవాలను పక్కనబెట్టిన బీఆర్ఎస్ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి తప్ప దిగజారి ప్రవర్తించొద్దని హితవు పలికారు. కేటీఆర్ బావమరిది ఫామ్ హౌస్ లో డ్రగ్స్ దొరికినప్పటికీ నోటీసులు ఇచ్చిన తర్వాతే విచారణ చేపట్టామని తెలిపారు. బండి భగీరథ్ విషయంలోనూ ఇలాగే వ్యవహరించామని చెప్పారు. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారని స్పష్టం చేశారు.

* **ఇంకా కల్వకుంట్ల రాజ్యాంగంలోనే ఉన్నారా?**

మాజీ మంత్రి కేటీఆర్ తాను ఇంకా కల్వకుంట్ల రాజ్యాంగంలోనే ఉన్నట్టు భ్రమ పడుతున్నారని సీఎం ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కుర్చీ నుంచి కేసీఆర్ దిగిపోయి చాలా రోజులైందని ఎద్దేవా చేశారు. తన పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదని నిలదీశారు.

* **సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం...**

కులగణన విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో జనగణనతోపాటు కులగణనను చేపట్టడమేగాక అన్ని వివరాలను ప్రజల ముందుంచామని వివరించారు. ఈ విషయంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కూడా తక్షణమే జనగణనలో కులగణన చేర్చటం ద్వారా బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఎండదెబ్బ లక్షణాలు: అస్సలు నిర్లక్ష్యం చేయకండి!

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు జనాలు అల్లాడిపోతున్నారు. ఈ తరుణంలో వడదెబ్బ (హీట్ స్ట్రోక్) తగిలే అవకాశం చాలా ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఒంట్లో వచ్చే నీరసాన్ని మామూలు అలసటగా భావించి నిర్లక్ష్యం చేయొద్దని, వడదెబ్బ నిమిషాల్లోనే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు.

**ఈ లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం**

కళ్లు తిరగడం
విపరీతమైన తలనొప్పి
వాంతులు, వికారం
గుండె వేగంగా కొట్టుకోవడం
కండరాల నొప్పులు
ఎక్కువ వేడిగా అనిపించడం
విపరీతంగా చెమటలు పట్టడం

**మెదడుపై పడే తీవ్ర ప్రభావం**

పరిస్థితి విషమిస్తే వడదెబ్బ మెదడుపై ప్రభావం చూపిస్తుంది. బాధితుల్లో గందరగోళం పెరగడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, చుట్టుపక్కల ఏం జరుగుతుందో తెలియని స్థితికి వెళ్లడం వంటివి జరుగుతాయి. ఇలాంటి ప్రవర్తన కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. లేదంటే మూత్రపిండాలు, గుండె వంటి అవయవాలు పాడైపోయే ప్రమాదం ఉంది.

**వీరికి ముప్పు చాలా ఎక్కువ**

ఈ మండుతున్న ఎండల వల్ల కొందరు చాలా త్వరగా అనారోగ్యానికి గురవుతారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఎండలో పనిచేసే కూలీలు జాగ్రత్తగా ఉండాలి. అలాగే గుండెజబ్బులు, షుగర్ ఉన్నవారికి వడదెబ్బ తగిలే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది.

**ప్రథమ చికిత్స**

* బాధితుడిని నీడ ఉన్న చల్లటి ప్రదేశానికి చేర్చాలి.
* ఒంటిపై ఉన్న బట్టలను వదులు చేయాలి.
* తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలి.
* మెడ, చంకల్లో ఐస్ ప్యాక్‌లు పెట్టాలి.
* మనిషి పూర్తి స్పృహలో ఉంటేనే తాగడానికి నీళ్లు ఇవ్వాలి.
* సొంత వైద్యం అస్సలు చేయొద్దు.
* పారాసిటమాల్ మాత్రలు అస్సలు వేయొద్దు.

# ఎయిరిండియా ప్రయాణికులకు తప్పిన ముప్పు!

ఢిల్లీ నుంచి బెంగళూరు వచ్చిన ఎయిరిండియా విమానానికి ల్యాండింగ్ సమయంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. రన్‌వేపై దిగుతున్న తరుణంలో దాని వెనుక భాగం (తోక) భూమిని బలంగా తాకింది. అయితే పైలట్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు.

**గాల్లో మారిన బ్యాలెన్స్**

ఢిల్లీ నుంచి బెంగళూరుకు 179 మంది ప్రయాణికులతో వచ్చిన ఏఐ2651 ఎయిర్ బస్ విమానం ల్యాండింగ్ కావడానికి సిద్ధమైంది. సరిగ్గా అదే సమయంలో రన్‌వేపై నుంచి మరో పెద్ద విమానం టేకాఫ్ కావడంతో గాల్లో తీవ్రమైన గాలి అలల ఉద్ధృతి (విండ్ టర్బులెన్స్) ఏర్పడింది. దీనివల్ల విమానం బ్యాలెన్స్ తప్పడంతో పైలట్లు ల్యాండింగ్‌ను తాత్కాలికంగా ఆపి మళ్లీ విమానాన్ని పైకి లేపేందుకు ప్రయత్నించారు. ఈ ప్రక్రియలోనే విమానం తోక భాగం రన్‌వేను గీసుకుంటూ వెళ్లింది.

**విమానం నిలిపివేత**

ఈ ఘటన జరిగిన వెంటనే అధికారులు అలర్ట్ అయ్యారు. ఎయిరిండియా సంస్థ ఈ ఎయిర్‌బస్ ఏ321 విమానాన్ని తదుపరి తనిఖీల కోసం ఎయిర్‌పోర్టులోనే నిలిపివేసింది. దీనివల్ల బెంగళూరు నుంచి తిరిగి ఢిల్లీ వెళ్లాల్సిన ఏఐ2652 ఫ్లైట్‌ను క్యాన్సిల్ చేశారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి తెలిపారు.

**రంగంలోకి డీజీసీఏ**

ఈ ప్రమాదంపై విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ దర్యాప్తు ప్రారంభించింది. నిబంధనల ప్రకారం దర్యాప్తు పూర్తయ్యే వరకు సదరు పైలట్లను విధుల నుంచి తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఎయిరిండియా గ్రౌండ్ టీమ్స్ ప్రయాణికులకు అవసరమైన సాయాన్ని అందిస్తున్నాయి.

# ఎబోలా కలకలం.. భారత్‌ఆఫ్రికా శిఖరాగ్ర సదస్సు వాయిదా!

ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ కలకలం రేపుతుండటంతో ఢిల్లీలో జరగాల్సిన నాలుగో 'భారత్‌ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. మే 28 నుంచి 31 వరకు జరగాల్సిన ఈ సదస్సును ప్రస్తుత ప్రజారోగ్య పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా దేశాల్లో ఎబోలా వ్యాప్తి తీవ్రంగా ఉండటంతో 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' అంతర్జాతీయ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ఆఫ్రికా కూటమితో చర్చించి నిర్ణయం**

సదస్సు వాయిదా వేసే ముందు భారత ప్రభుత్వం, ఆఫ్రికన్ యూనియన్ ఛైర్‌పర్సన్, ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఆఫ్రికా దేశాల ప్రతినిధులు, కీలక నేతలు అందరూ పూర్తి స్థాయిలో హాజరయ్యేలా చూడటంతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సదస్సును మరో తేదీకి మార్చడమే మంచిదని ఇరుపక్షాలు నిర్ణయించాయి. ఆఫ్రికాలో ఎబోలాను అదుపు చేయడానికి 'ఆఫ్రికా సీడీసీ' తీసుకుంటున్న చర్యలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని, మద్దతును ప్రకటించింది.

# రోబో సైన్యంతో రైల్వే స్టేషన్ నిర్మాణం

* **38 నెలల్లో చోంగ్‌కింగ్ రైల్వే స్టేషన్ ను నిర్మించిన చైనా**

బీజింగ్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గత వారం చైనాను సందర్శించినప్పుడు, ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే అతి పెద్దదైన చోంగ్‌కింగ్ ఈస్ట్ రైల్వే స్టేషన్ నిర్మాణ ప్రయాణానికి సంబంధించిన ఒక వీడియోను ఎక్స్‌లో రీపోస్ట్ చేశారు. మస్క్ ఆ పోస్ట్‌లో ఏమీ రాయనప్పటికీ, ఆయన ఆ పోస్ట్ ఎందుకు చేశారనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే, ఆయన గతంలో ప్రజా రవాణాపై ఓ సందేహాన్ని వ్యక్తం చేశారు. ఈ ఆసక్తిని పక్కన పెడితే చైనాలో చోంగ్‌కింగ్ ఈస్ట్ రైల్వే స్టేషన్ నిర్మాణం గురించిన పలు విషయాలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి. చోంగ్‌కింగ్ ఈస్ట్ రైల్వే స్టేషన్ ఇది ఒక భారీ బహుళ రవాణా సముదాయం. ప్రపంచం లోనే అత్యధిక విస్తీర్ణం కలిగిన అతిపెద్ద రైల్వే స్టేషన్. దీనిని మే 2025లో ప్రజల కోసం ప్రారంభించారు. నైరుతి చైనాలోని లోతట్టు ప్రాంతంలో ఉన్న చోంగ్‌కింగ్ జనాభా , పరిపాలనా విస్తీర్ణం రెండింటిలోనూ దేశంలోనే అతిపెద్ద నగరం. నేడు ఒక ప్రధాన ఆర్థిక శక్తి కేంద్రంగా చోంగ్‌కింగ్ ఉంది. అక్కడ నిర్మించిన కొత్త స్టేషన్, చైనా యొక్క అద్భుతమైన ఇంజినీరింగ్ నిర్మాణానికి, దాని భారీ ఆర్థిక బలానికి ఒక ప్రదర్శనగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు అపార్ట్‌మెంట్ బ్లాక్‌ల గుండా మెట్రో రైళ్లు వెళ్లే చైనా నగరం ఇదే. అనేక దేశాలు భారీ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి దశాబ్దాల పాటు శ్రమిస్తుండగా చైనా 12.2 లక్షల చదరపు మీటర్ల భారీ స్టేషన్‌ను కేవలం 38 నెలల్లోనే నిర్మించింది. రోబోల సైన్యమే ఈ స్టేషన్‌ను అత్యద్భుతంగా నిర్మించింది.

**చైనా అంతర్గత మెగాసిటీగా చోంగ్‌కింగ్**

ఈ చోంగ్‌కింగ్ రైల్వే స్టేషన్ గురించి తెలుసుకునే ముందు దాని వెనుక ఉన్న నగరాన్ని తెలుసుకోవడంతో పాటు దాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. చోంగ్‌కింగ్ చైనా యొక్క అత్యంత ముఖ్యమైన, చైతన్యవంతమైన మెగాసిటీలలో ఒకటి. షాంఘై , బీజింగ్ వంటి అనేక ఇతర చైనీస్ పట్టణ కేంద్రాల వలే, చోంగ్‌కింగ్ కూడా దాదాపు 3,000 సంవత్సరాల పురాతన నగరం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1937లో జపనీస్ దళాల చేతిలో అప్పటి రాజధాని నాన్కింగ్ పతనమైన తర్వాత, ఇది చైనీస్ నేషనలిస్ట్ (కేఎంటీ) ప్రభుత్వానికి రాజధానిగా పనిచేసింది. 1960వ దశకంలోనే చోంగ్‌కింగ్ చైనా యొక్క అత్యంత ముఖ్యమైన పట్టణ కేంద్రాల్లో ఒకటిగా ఎదిగింది. మావో జెడాంగ్ దర్శకత్వం వహించిన భారీ పారిశ్రామికీకరణ ప్రచారమైన థర్డ్ ఫ్రంట్ క్యాంపెయిన్ నుంచి ఈ నగరం ప్రధాన లబ్ధిదారుగా మారింది.

# 'నీలీ' నీడ: 'అక్టోబర్ 7' హంతకులపై ఇజ్రాయెల్ హైటెక్ వేట!

2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడుల తర్వాత, ఇజ్రాయెల్ తన చరిత్రలోనే అత్యంత భారీ, రహస్యమైన వేటను ప్రారంభించింది. ఈ దాడిలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి, ట్రాక్ చేసి, హతమార్చడం లేదా పట్టుకోవడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ (డబ్ల్యూఎస్‌జే) వెల్లడించిన ఒక కథనం ప్రకారం ఇజ్రాయెల్ నిఘా సంస్థలు ఇందుకోసం 'నీలీ' అనే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాయి. హీబ్రూలో "ది ఎటర్నల్ వన్ ఆఫ్ ఇజ్రాయెల్ డజంట్ లై" (ఇజ్రాయెల్ శాశ్వత శక్తి అబద్ధం చెప్పదు) అనే అర్థం వచ్చేలా ఈ పేరు పెట్టారు.

**టెక్నాలజీతో వేట.. ఎలా గుర్తిస్తున్నారు?**

ఈ ఆపరేషన్ పూర్తిగా సర్వైలెన్స్ టెక్నాలజీ, నిఘా వర్గాల సమాచారం, మిలిటెంట్లు వదిలివెళ్లిన డిజిటల్ ఆధారాలపైనే నడుస్తోంది. దాడుల సమయంలో మిలిటెంట్లు తమ ఫోన్లు, గోప్రోలతో చిత్రీకరించిన వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, ఇంటర్‌సెప్ట్ చేసిన ఫోన్ కాల్స్, సెల్ టవర్ డేటా, మరియు అదుపులోకి తీసుకున్న వారి నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తున్నారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం, దాడుల ఫుటేజ్‌ల నుంచి అనుమానితులను గుర్తించడానికి ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌లను వాడుతున్నారు. ఎవరినైనా లక్ష్యంగా చేసుకోవడానికి ముందు కనీసం రెండు బలమైన ఆధారాలను నిర్ధారించుకుంటున్నట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ పరిధి ఎంత విస్తృతంగా ఉందంటే, దాడి సమయంలో సరిహద్దు కంచెను ట్రాక్టర్‌తో కూల్చిన వ్యక్తిని కూడా వదలకుండా, సుదీర్ఘకాలం తర్వాత వైమానిక దాడిలో హతమార్చారు.

**గాజా నుంచి లెబనాన్, ఇరాన్ వరకు**

ఈ రహస్య ఆపరేషన్లు కేవలం గాజాకే పరిమితం కాలేదు. లెబనాన్, ఇరాన్ వంటి దేశాల్లోని హమాస్ సీనియర్ నాయకులను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. 2024 జనవరిలో బీరూట్‌లో హమాస్ నేత సలేహ్ అల్‌అరౌరీ, ఆ తర్వాత కొద్ది నెలలకు టెహ్రాన్‌లో హమాస్ రాజకీయ అధినేత ఇస్మాయిల్ హనియే, అక్టోబర్ 7 దాడితో సంబంధం ఉన్న సీనియర్ కమాండర్ ఎజెద్దీన్ అల్‌హద్దాద్‌లను హతమార్చడం ఈ ఆపరేషన్‌లోని కీలక ఘట్టాలు. దాడికి బాధ్యులైన వారిని దాదాపుగా మట్టుబెట్టామని, గాజా మళ్లీ తమకు ముప్పుగా పరిణమించకుండా చూస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల ప్రకటించినట్లు లే మాండే పత్రిక పేర్కొంది.

* **మ్యూనిచ్ తరహా ప్రతీకారం.. నైతిక ప్రశ్నలు**

ఈ ఆపరేషన్‌ను చాలా మంది 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో 11 మంది ఇజ్రాయెల్ అథ్లెట్లను చంపిన మిలిటెంట్లపై మొసాద్ జరిపిన దశాబ్దాల వేటతో పోలుస్తున్నారు. మొసాద్ చీఫ్ డేవిడ్ బర్నియా కూడా "మ్యూనిచ్ ఘటన అనంతర ఆపరేషన్ లాగే దీనికీ సమయం పడుతుంది. కానీ వారు ఎక్కడున్నా మా చేతులు వారిని చేరుకుంటాయి" అని వ్యాఖ్యానించడం గమనార్హం.

# చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనపర్చాలి: మేయర్ మూడ్ గణేష్

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:బాల బాలికలంతా చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం త్రీ ఇంక్లైన్‌లోని తెలంగాణ క్రీడమైదానం నందు కొనసాగుతున్న రెజ్లింగ్ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న బాల, బాలికలకు గురువారం వివిధ కేటగిరిలలో రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత, జిల్లా క్రీడాధికారి యం పరంధామ రెడ్డి, టీ.పీ.సీ.సీ ప్రధాన కార్యదర్శి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాగ సీతారాములు పాల్గొని ప్రారంభించారు.




అనంతరం రెజ్లింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి వివిధ స్థాయిలలో గెలుపొందిన బాల, బాలికలకు అతిధుల చేతులమీదుగా పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ గణేష్ మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాల, బాలికలను అభినందించారు. జిల్లా క్రీడా అధికారి పరంధామ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్ సహకారంతో క్రీడాకారులకు శిక్షణ సామాగ్రిని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. కాశీ హుస్సేన్, త్రీ ఇంక్లైన్ సర్పంచ్ ఈసం ప్రవళిక, ఉప సర్పంచ్ పాల్తీయ లక్ష్మీ, జిల్లా ఇండియన్ స్టైల్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బరిగెల భూపేష్ , జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆదినారాయణ, గుగులోతు కృష్ణ, బోడ గణేష్, పలువురు కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## గుండె పోటుతో ఒకరు మృతి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన దాసరి చంద్రమోహన్(53) అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మృతుని బంధువులు తెలిపిన ప్రకారం చంద్రమోహన్ గత కొన్ని సంవత్సరాల నుండి కరీంనగర్ లో సివిల్ కాంట్రాక్టర్ గా పని చేస్తున్నాడు అని తెలిపారు. వృద్ధులైన చంద్రమోహన్ తల్లిదండ్రులు రాంపూర్ గ్రామంలో ఉండటంతో ఆయన సతీమణి గత మూడు రోజుల క్రితం రాంపూర్ కు వచ్చి వారి బాగోగులు చూసుకుంటున్నారు. కరీంనగర్లో ఒంటరిగా ఉన్న చంద్రమోహన్ కు బుధవారం రాత్రి చాతిలో నొప్పి రావడంతో తన స్నేహితుడికి ఫోన్ చేసి తెలిపాడని వెంటనే వచ్చిన స్నేహితుడు హాస్పిటల్ కు తీసుకువెళ్లి చికిత్స చేయించారని తెలిపారు. బుధవారం రాత్రి కరీంనగర్ లోని ఇంటికి వచ్చిన చంద్రమోహన్ కు గురువారం తెల్లవారుజామున మళ్లీ గుండెపోటు రావడంతో స్నేహితుడు వెళ్లేసరికి మృతి చెందాడు. చంద్రమోహన్ కు భార్య రజిత, ఇరువురు కూతుళ్లు తేజస్విని, అంజలి వృద్ధులైన కౌసల్య, నరసయ్య అనే తల్లిదండ్రులున్నారు. చంద్రమోహన్ మరణంతో తన స్వగ్రామమైన రాంపూర్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం సాయంత్రం స్వగ్రామమైన రాంపూర్ లో చంద్రమోహన్ అంత్యక్రియలు నిర్వహించారు.

## చింతగూడ వద్ద బస్ ఆపాలని వినతి పత్రం అందజేత

ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని చింతగూడ వద్ద ఎక్స్ప్రెస్ బస్సు ఆపాలని కోరుతూ గ్రామ సర్పంచ్ సుతారి సుమలత వినయ్ గురువారం రోజున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. చింతగూడ గ్రామంలో పురాతనమైన, మహా మహిమాన్వితమైన, భక్తుల కోరికలు తీర్చే మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఉందని, ఈ ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి, అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ రాష్ట్రాల నుండి, జిల్లాల నుండి, మండలాల నుండి భక్తులు ఇక్కడికి వస్తారు కావున చింతగూడ వద్ద ఎక్స్ప్రెస్ బస్ ఆపాలని కోరారు.

## అప్రైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : ఇటీవలే నూతనంగా నియామకమైన తెలంగాణ రాష్ట్ర డిసిసి సహకార బ్యాంక్ అప్రైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్ ను గురువారం రోజున ఏ డి సి సి జన్నారం బ్యాంక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడిసిసి బ్యాంక్ మేనేజర్ అశ్విన్ కుమార్, బ్యాంకు సిబ్బంది అనిల్, సాగర్, అనిత, లావణ్య ,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లను ప్రారంభించిన జిల్లా ఎస్పీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలోని నెహ్రూ సెంటర్, మదర్ థెరిస్సా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లను జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రారంభించారు. పట్టణంలో పెరుగుతున్న వాహన రద్దీ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈ సిగ్నల్ వ్యవస్థను అమలు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాటించాలని సూచించారు. రెడ్ సిగ్నల్ వద్ద వాహనాలను ఆపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగించడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించడంతో పాటు సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐ అరుణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సీతారామచంద్ర స్వామి వారి మాస కళ్యాణం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీవేదాంత భజన మందిరంలో గురువారం సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పంచామృత అభిషేకంతో పాటు మాస కళ్యాణంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర రావు, మందిర ప్రధాన అర్చకులు ధరూరీ సింగరా చార్యులు మాట్లాడుతూ పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రతి నెల స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకంతో పాటు కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళ్యాణం అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాదం అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, మందిర కార్యదర్శి నకిరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమా అశోక్, సోమా సుమన్, ఈగ వెంకటేశ్వర్లు, షీలా శంకర్, ఓరుగంటి అశోక్, అంతటి దినేష్, వీరవెల్లి రామ్మూర్తి, కక్కిరేణి విజయ్, గోదాదేవి, మౌనిక, ప్రసన్న, రేణుక, హేమలత, స్వాతి అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, గోమఠం రాఘవాచార్యులు, తిరుమల ప్రతీక్ , తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

* **ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ**




ప్రజాస్ఫూర్తి, జన్నారం : స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ రెండు పర్యాయాలు భారతదేశనికి ప్రధాన మంత్రి గా పని చేశారని, అతి చిన్న వయస్సులొనే 40 ఏళ్ల కే దేశానికి ప్రధాన మంత్రి అయ్యారన్నారు. దేశానికి టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థ, భారతాన్ని ఆధునిక యుగం వైపు నడిపించిన యువ నాయకుడు, ఐటీ రంగానికి పితామహుడుగా, టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడుగా, దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా రాజీవ్ గాంధీ ఎన్నటికీ చెరగని ముద్ర వేశారని కొనియాడారు. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు, యువతకు 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చారు అని, ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన బాట నేడు ప్రతి ఒక్కరు చూపించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నందునాయక్, ఏఎంసి ఛైర్మన్ లక్ష్మీ నారాయణ, పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు, గుర్రం మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్సాక్, జిల్లా కార్యదర్శి ముజాఫర్ అలీఖాన్, ముత్యం సతీష్, సీనియర్ నాయకులు, సర్పంచ్ లు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు, మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువత, విద్యార్థులు శిలా సంపదపై అవగాహన పెంపొందించుకోవాలి

* **శిలా సంపద మ్యూజియం ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**



జయశంకర్ భూపాలపల్లి , ప్రజాస్ఫూర్తి : యువత, విద్యార్థులు మ్యూజియంను సందర్శించి శిలా సంపదపై అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. రూ.1.20 కోట్ల వ్యయంతో కాళేశ్వరంలో నూతనంగా నిర్మించిన శిలా సంపద మ్యూజియంను గురువారం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మ్యూజియంను పరిశీలించి, అందులో ఏర్పాటు చేసిన వివిధ రకాల శిలా సంపదను ఆసక్తిగా వీక్షించారు. చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మ్యూజియం నిర్మాణం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గవర్నర్ దంపతులకు జిల్లా యంత్రాంగం ధన్యవాదాలు తెలిపారు.

## మొక్కజొన్న, వరి ధాన్యం కొను గోళ్లను వేగవంతం చేయాలి

* **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సాఫీగా, వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 20,953 మంది రైతుల వద్ద నుంచి 1,21,063 మెట్రిక్ టన్నుల ధాన్యా న్ని కొనుగోలు చేయగా, అందులో 1,14,484 మెట్రిక్ టన్నులను ఇప్పటికే మిల్లులకు తరలించినట్లు తెలిపారు. అలాగే 17,180 మంది రైతుల ఖాతాల్లో రూ.211 కోట్లు జమ చేసినట్లు వెల్లడించా రు. మరోవైపు 95,970 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు వివ రాలను ఓపీఎంఎస్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి మిల్లు, కొనుగోలు కేంద్రం వారీగా ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్‌లోడింగ్ పెండింగ్ వివరాలను అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. మిల్లర్లు అదనపు గోదాములు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రైతులు తీసుకువస్తున్న మొక్క జొన్న, వరి ధాన్యాన్ని ఎటువంటి జాప్యం లేకుండా తూకం వేసి వెంటనే కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. గన్ని బ్యాగుల కొరత తలెత్తకుండా తగిన నిల్వలు ఉంచాలని సూ చించారు. ఓపీఎంఎస్ నమోదు ను ఎప్పటికప్పుడు చేయాలని, రవాణా, గోదాముల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమా వేశం లో డీఆర్‌డీవో భాస్కర్, మార్క్‌ఫెడ్ డీఎం చంద్రశేఖర్, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, అదనపు డీఆర్‌డీఓ నూరుద్దీన్, పౌరసరఫరాల సంస్థ డీ.ఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, డీసీఎస్ఓ సురేష్‌రెడ్డి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ తదితరులు పాల్గొన్నారు.

## దేవుని మాన్యం భూమిని రక్షించాలి : బండ శోభా చంద్ర మౌళి

* **మండల తహసీల్దార్ కు కళ్లెం గ్రామ సర్పంచ్ వినతి.**




జనగామ / లింగాల ఘణ పురం, ప్రజాస్ఫూర్తి : దేవుని మాన్యం భూమిని రక్షించాలని మండల తహసీల్దార్ కు కళ్లెం గ్రామ సర్పంచ్ బండ శోభా చంద్ర మౌళి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. మండలం లోని కళ్లెం గ్రామంలో సర్వే నంబర్లు 349/1, 349/2, 349/3, 349/4 పరిధి లో ఉన్న మొత్తం 33 గుంటల భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపించారు. ఆ భూముల పై ఉన్న అక్రమ పట్టాలను వెంటనే తొలగించి, ఎలాంటి పట్టా మార్పిడులు జరగ కుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అండాలు ను కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గత 50 సంవత్సరాలు గా ఈ భూమి కళ్లెం గ్రామం లోని శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి వారి మాన్యంగా కొనసాగుతోందని తెలిపారు. అట్టి భూమిని గ్రామంలోని రైతులకు కౌలుకు ఇచ్చి వచ్చే ఆదాయాన్ని ఆలయ నిర్వహణ, కార్యక్రమాల కోసం వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు ఈ భూమిని అక్రమంగా తమ పేర్ల పై పట్టా చేసుకుని, ఇతరులకు అమ్మడం లేదా రిజిస్ట్రేషన్లు చేయడానికి ప్రయ త్నిస్తున్నారని తెలిపారు. దీంతో దేవుని మాన్యాన్ని రక్షించి, సంబంధిత భూమి ని శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం పేరు మీద పట్టా మార్పిడి చేయాలని తహసీల్దార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరే సంపత్, పీఏసీఎస్ ఛైర్మన్ బుషిగంపల ఉపేందర్, గ్రామ ఆలయాల పునర్నిర్మాణ కమిటీ ఛైర్మన్ జిల్లెల్ల వెంకట్ రెడ్డి, స్వయంభూ దేవస్థాన ఛైర్మన్ మ్యాన ఆంజనేయులు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు..

* **75% వడ్ల కొనుగోలు పూర్తి చేశాం.**
* **హుస్నాబాద్ డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ జంగంపల్లి ఐలయ్య**



హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : అక్కన్నపేట మండలంలోని పలువుడ్ల కొనుగోలు కేంద్ర సందర్శించిన హుస్నాబాద్ డివిజన్ రైతు ఆత్మ ఛైర్మన్ జంగపల్లి ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు అక్కన్నపేట మండలంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా జంగపల్లి ఐలయ్య మాట్లాడుతూ కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి అధైర్యపడవద్దని తెలిపారు. మన ప్రజా ప్రభుత్వం ప్రతి గింజలు కొంటుందని తెలిపారు మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో 70% నుండి 80% కొనుగోలు పూర్తి అయ్యాయని మిగతా ధాన్యాన్ని వారం పది రోజులలోనే కొనుగోలు పూర్తయిందని తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్ముతూ రైతులు ఎలాంటివి ఆందోళన చెందొద్దని తెలిపారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలపైన ఉన్నతాధికారులకు దృష్టి తీసుకువెళ్లి సమస్యను వెంటనే పరిష్కరిస్తుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఎగ్గిడి అయిలయ్య , ముకుంద రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు బండి కుమార్, బుర్ర ప్రభాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బైకాన్ శ్రీనివాస్, కరెంటుతోతు రవీందర్, లింగంపల్లి సారయ్య, చింతల బాలరాజ్ , అక్బర్ ,బాషా మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తండాల కష్టాలు శాశ్వతంగా తీరుస్తా : మంత్రి పొంగులేటి హామీ

* **గోప తండా బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: నేను ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో పర్యటించిన అనేక సందర్భాల్లో రహదారి అధ్వాన్నంగా మారి గిరిజన బిడ్డలు పడిన రవాణా కష్టాలను కళ్లారా చూశాను. ఇక్కడి ప్రజల ఆశీర్వాదమే నేడు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. మంత్రి హోదాలో ఈ గడ్డ రుణం తీర్చుకుంటా తండాల కష్టాలు శాశ్వతంగా తీరుస్తా అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలం ఎర్రగడ్డ తండా వద్ద నర్సింహులగూడెం నుంచి గోప తండా వరకు రూ.7.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఆయన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి రాబోయే 3 నెలల్లోగా ఈ రోడ్డును పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు. నర్సింహులగూడెం సమగ్ర అభివృద్ధికి ఇప్పటివరకు రూ.17 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు, రూ.2 లక్షల రుణమాఫీ, సన్నబియ్యం బోనస్ వంటి సంక్షేమ పథకాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## తెలంగాణ రక్షణ సేనపై అభ్యంతరాలకు జూన్ 1వరకు గడువు




దిల్లీ: కల్వకుంట్ల కవిత నూతనంగా ఏర్పాటుచేసిన తెలంగాణ రక్షణ సేనపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే జూన్ 1వ తేదీలోపు చెప్పుకోవచ్చని కేంద్ర ఎన్నికలసంఘం పేర్కొంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కొత్త పార్టీ ఏర్పాటు గురించి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మే 1వ తేదీన ది ఎకో ఆఫ్ ఇండియా పత్రికలో ఇంగ్లిష్‌లో, మే 3న ఆజ్ అన్న హిందీపత్రికలో బహిరంగ ప్రకటన ఇచ్చారు. అందులో పార్టీ చిరునామా, ప్రెసిడెంట్ (కల్వకుంట్లకవిత) వైస్‌ప్రెసిడెంట్ (రూప్‌సింగ్ లఖావత్), జనరల్ సెక్రెటరీ (దేవనపల్లి రామయగారి అనిల్‌కుమార్), ట్రెజరర్ (అరుణ్‌కుమార్), జాయింట్ ట్రెజరర్ (పొనుగోటి పవన్‌కుమార్)ల పేర్లు ఇచ్చారు. బంజారాహిల్స్ రోడ్డు నెం.14, సర్వే నెంబర్ 129/54లోని 82316/హెచ్ ఇంటినెంబర్‌ను చిరునామాగా పేర్కొన్నారు. ఈ పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలుంటే కారణాలతో సహా కేంద్ర ఎన్నికలసంఘం కార్యదర్శి (రాజకీయపార్టీల వ్యవహారాలు)కి 30రోజుల్లోపు పంపాలని ఈ ప్రకటనలో పిలుపునిచ్చారు. దీని ప్రకారం జూన్ 1వరకు అభ్యంతరాలు పంపుకోవడానికి వీలున్నట్లు కేంద్ర ఎన్నికలసంఘం తెలిపింది.

# కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరం

* పానగల్ యూపీహెచ్సిలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రారంభం..




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల యాక్షన్ ప్లాన్'లో భాగంగా 15-18 సంవత్సరాల వయస్సు గల కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక ఆరోగ్య స్క్రీనింగ్ శిబిరాన్ని గురువారం పానగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లో నిర్వహించారు. ఈ కార్యక్రమం 18 మే 2026 నుండి 23 మే 2026 వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ శిబిరంలో రక్తహీనత మధుమేహం బి.ఎం.ఐ పరీక్షలతో పాటు నెలసరి పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కౌమార దశలో బాలికలు ఎదుర్కొనే శారీరక, మానసిక, పోషకాహార సంబంధిత సమస్యలపై వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బాలికల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కౌమార దశలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా రక్తహీనత, పోషకాహార లోపం, నెలసరి పరిశుభ్రత వంటి అంశాలపై ప్రతి బాలికకు అవగాహన అవసరమని తెలిపారు. వైద్యులు ఇచ్చే సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర మాట్లాడుతూ, 15-18 సంవత్సరాల వయస్సు గల బాలికలలో హార్మోన్ల మార్పుల కారణంగా శారీరక, మానసిక సమస్యలు సాధారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా రక్తహీనత సమస్య అధికంగా కనిపిస్తోందని, సమతుల ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తబస్సుం మాట్లాడుతూ, కౌమార దశలో ఋతుస్రావ సమస్యలు, మొటిమలు, బలహీనత, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని తెలిపారు. సరైన పోషకాహారం, పరిశుభ్రత, వైద్య సలహాలు పాటించడం ద్వారా సమస్యలను అధిగమించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ పిఏసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, కార్పొరేటర్లు శ్రీమతి పేర్ల మల్లేశ్వరి,, శ్రీమతి ఆలకుంట్ల ఝాన్సీ, మెప్మా టీఎంసీ శ్రీనివాస్ , సి.ఓలు అనిల్ కుమార్, జ్యోతి, రాజా, నరసింహ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆర్పీలు పాల్గొన్నారు. మొత్తం 89 మంది కౌమార బాలికలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

## తుర్కగూడెం మురుగునీటి సమస్యపై అధికారుల స్పందన

* ప్రజల ఆగ్రహంతో కదిలిన అధికారులు
  – త్వరిత చర్యలకు హామీ



కూసుమంచి, ప్రజాస్ఫూర్తి: కూసుమంచి మండలంలోని తుర్కగూడెం గ్రామ బజారులో నెలల తరబడి కొనసాగుతున్న మురుగునీటి సమస్యపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు స్పందించారు. గ్రామ ప్రజలు, వ్యాపారులు సమస్యను పలుమార్లు గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై బుధవారం వచ్చిన ప్రజా స్ఫూర్తి వార్తా కథనాల అనంతరం సంబంధిత అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బజారు ప్రాంతంలో నిల్వ ఉన్న మురుగునీటితో దుర్వాసన వ్యాపించడం, దోమల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు అధికారులకు వివరించారు. ముఖ్యంగా వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని తెలిపారు. వ్యాపార కార్యకలాపాలపై కూడా ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు తాత్కాలికంగా మురుగునీటి తొలగింపు పనులు వెంటనే చేపట్టారు,శాశ్వత పరిష్కారంగా డ్రైనేజీ మరమ్మతులు మరియు శుభ్రపరిచే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇకపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరారు. అధికారులు ఇచ్చిన హామీలు అమలవుతాయా లేదా అన్నదానిపై గ్రామస్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ధాన్యం దిగుమతిలో రైతులకు ఇబ్బందులు కలగనివ్వొద్దు

* డీసీపీ రాజమహేంద్ర నాయక్



జనగామ / లింగాల ఘణపురం, ప్రజాస్ఫూర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జనగామ డీసీపి రాజమహేంద్ర నాయక్. జిల్లా లోని లింగాల ఘణపురం మండలం, నెల్లుట్ల, కుందారం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను డీసీపీ రాజమహేంద్ర నాయక్ సందర్శించారు. ఈ సందర్భం గా రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియ పై వివరాలు తెలుసుకున్నారు. రైతులు ట్రాక్టర్ల ద్వారా మిల్లుల వద్దకు తీసుకెళ్లిన ధాన్యాన్ని దిగుమతి చేసు కోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నా రని డీసీపీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన మహాలక్ష్మి, మహేశ్వర రైస్ మిల్లులను సందర్శించి అక్కడి మిల్లర్లతో మాట్లా డారు. లారీలు, ట్రాక్టర్ల లో వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని, రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని మిల్లర్లకు సూచించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరిం చే లా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జనగామ సీఐ సత్య నారాయణ రెడ్డి, ఎస్సై శ్రావణ్ కుమార్, సీసీ శ్రీకాంత్ రెడ్డి, కుందారం గ్రామ సర్పంచ్ కూకట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీతోనే సాంకేతిక పరిజ్ఞానానికి నాంది

* చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భారతదేశంలో సాంకేతిక పరిజ్ఞానానికి నాంది పలికిన ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బస్టాండ్ ఆవరణలోని రాజీవ్ స్మారక భవనంలో రాజీవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 36వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రపంచ దేశాలలో భారత దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేశానన్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులు వేశారని, కంప్యూటర్ యుగాన్ని తీసుకొచ్చారన్నారు. ఓటు హక్కు వయోపరిమితిని 21ఏళ్ల వయస్సు నుంచి 18 ఏళ్లకే తగ్గించాలని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మా గౌడ్, రాజీవ్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు జీంద్రు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. ఖయ్యూం, కార్యదర్శి నల్ల నరసింహ, నాయకులు చింతల సాయిలు, ఆవుల యేసు, కంచర్ల జంగయ్య, మాదని గోపాల్, బండమీద ఎల్లయ్య, ఎండీ చాంద్ పాషా, ముత్యాల గణేష్, ఊదరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్లో కొన్ని చోట్ల విద్యుత్ వైర్లు మార్చాలి: వీహెచ్




హైదరాబాద్: నగరంలో పలుచోట్ల విద్యుత్ వైర్లను మార్చాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు (వీహెచ్) కోరారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. ''పలు ప్రాంతాల్లో నిజాం కాలంలో వేసిన విద్యుత్ వైర్లు ఇప్పటికీ ఉన్నాయి. పాత వైర్ల వల్ల కొన్నిచోట్ల షార్ట్ సర్క్యూట్ జరుగుతోంది. ఇన్సూరెన్స్ లేని వాళ్లకు చాలా నష్టం కలుగుతోంది. కొత్త వైర్లు వేయాలని వ్యాపారులు కోరుతున్నారు. దీంతో ప్రమాదాలు తగ్గి ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించవచ్చు. కొత్త వైర్లు వేసేలా భట్టి విక్రమార్క చర్యలు తీసుకోవాలి''అని కోరారు.

## రహదారులపై బైక్ స్టంట్లు చేస్తున్న యువకులను అరెస్ట్

* మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ
* ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఇద్దరు యువకులు




పాలేరు, ప్రజా స్ఫూర్తి: ప్రధాన రహదారులపై బైక్ స్టంట్లు (విన్యాసాలు) చేయడం చట్టవిరుద్ధం , ప్రాణాలకు అత్యంత ప్రమాదకరం.రీల్స్ కోసం పబ్లిక్ రోడ్లపై స్టంట్లు చేస్తూ పట్టుబడిన యువకులపై పోలీసులు కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ ప్రమాదకరం రీల్స్ సోషల్ మీడియాలో లైకులు, రీల్స్ కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ బహిరంగ రహదారులపై ప్రాణాపాయం కలిగించే విధంగా బైక్ స్టంట్లు చేస్తూ మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఇద్దరు యువకులను ఖమ్మం టాస్క్ ఫోర్స్, కూసుమంచి ఎస్సై నాగరాజు అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కాలంలో ఖమ్మం నగరంతో పాటు, పరిసర ప్రాంతాల్లోని జాతీయ రహదారులపై ప్రమాదకర విన్యాసాలు చేసి ఇతరుల ప్రాణాలకు ముప్పు తెస్తున్న కుసుమంచి మండలం, పేరికసింగారం గ్రామానికి చెందిన మాదవరుపు శివ రామకృష్ణ, (20) కోక్యతండా కు చెందిన బానోత్ జశ్వంత్ (18)ను గురువారం కూసుమంచి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ సోషల్ మీడియా బృందం నిశితంగా పరిశీలిస్తుందని, ఈ తరహా చర్యలకు పాల్పడే వారిపై పోలీసులు మోటారు వాహన చట్టం, పబ్లిక్ న్యూసెన్స్ కింద కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. బహిరంగ రోడ్లపై బైక్ విన్యాసాలు చేయడం చట్టరీత్యా నేరమని, విన్యాసాలు స్టంట్లు చేసే యువకుల ప్రాణాల మీదికి తేవడమే కాకుండా, రోడ్డుపై వెళ్లే పాదచారులకు, ఇతర వాహనదారులకు తీవ్ర ప్రమాదకరంగా మారుతున్నరాని అన్నారు. ప్రదానంగా తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు బైక్లు ఇవ్వకూడదని, అదేవిధంగా పిల్లల రోజువారి కార్యకలాపాలను నిశితంగా గమనిస్తూ ఉండాలని, చట్టవరుద్ధమైన ప్రాణాపాయం కలిగించే ఇలాంటి పనులకు దూరం ఉండేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. అలాగే యువత ఇలాంటి సాహసాలకు పోయి ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. ప్రజల భద్రతకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మోటారు వాహన చట్టం ప్రకారం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, రేసింగ్ చేస్తే జైలు శిక్ష, భారీ జరిమానాలు పడే అవకాశం ఉందన్నారు.

## దేశ యువతకు రాజీవ్ ఒక స్ఫూర్తి

* రాజీవ్ స్ఫూర్తితో దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకిత మవుదాం
* ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదే అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. స్వర్గీయ మాజీ ప్రధాని,భారత రత్న, దివంగత నేత రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యం.డి. అంజద్ అలి ఆధ్వర్యంలో జమ్మిగడ్డలో రాజీవ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు. రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చి గ్రామ పంచాయతీలకే సర్వ హక్కులు, అధికారాలు కల్పించారు రాజీవ్ గాంధీ. స్థానిక సంస్థలను బలోపేతం చేశారు. దేశంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి పేదల చేతిలో అధికారం పెట్టారని అన్నారు. సాంకేతిక విప్లవం తీసుకు వచ్చింది రాజీవ్ గాంధీ అని ఆయన గుర్తు చేశారు. "ఐటీ రంగంలోనే కాదు, టెలికాం రంగంలోనే సమూల మార్పులు తెచ్చి మారుమూల పల్లెలకు చేర్చారు. దేశంలో యువకులకు రాజీవ్ ఒక స్ఫూర్తినిచ్చారు. దేశ సమగ్రత కోసం, సమైక్యత కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబం. ఆయన జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను, ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వారి స్ఫూర్తితో మళ్లీ దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు
# జనగామ నుంచి ప్రత్యేక బస్సులు

: అర్టీసీ మేనేజర్ స్వాతి
* భక్తుల సౌకర్యార్థం 10 ప్రత్యేక బస్సులు..



జనగామ, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం జనగామ ఆర్టీసీ ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేసినట్లు జనగామ డిపో మేనేజర్ ఎస్.స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మే 21 నుంచి జూన్ 1వరకు గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమ క్షేత్రమైన కాళేశ్వరంలో జరిగే పుష్కరాల కోసం జిల్లా లోని పలు ప్రాంతాల నుంచి 10 ప్రత్యేక బస్సులతో 10 ట్రిప్పులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించి నట్లు వెల్లడించారు. పుష్కరాల నిమి త్తం కాళేశ్వరం లో జిల్లా యంత్రాంగం 4.36 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీకి అప్పగించిందని, అక్కడ తాత్కలిక బస్సు స్టేషన్ తోపాటు త్రాగు నీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, విద్యు త్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల భద్రత, పర్యవేక్షణ కోసం రెండు మొబైల్ ద్విచక్ర వాహ నాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రయాణికు లకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ప్రత్యేకంగా వాలంటీర్లను నియమించినట్లు పేర్కొన్నారు. పుష్కరాల ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీల కంటే 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్న ప్పటికీ, మహాలక్ష్మి పథకం కింద మహిళా ప్రయాణికులకు యథావిధిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగు తుందని ఆమె స్పష్టం చేశారు.

## బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్కు హైకోర్టు అనుమతి



హైదరాబాద్: బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు హైకోర్టు అనుమతించింది. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 8న పేట్ బషీరాబాద్ పీఎస్లో భగీరథ్పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 15న వాదనలు విన్న హైకోర్టు.. తీర్పును రిజర్వు చేసింది. 16న భగీరథ్ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు ఆయన తరఫున న్యాయవాది అనుమతి కోరారు. న్యాయవాది విజ్ఞప్తి మేరకు హైకోర్టు ఆ పిటిషన్ను కొట్టివేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది.

## ఎండ తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

* జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లాలో నాలుగు రోజుల పాటు ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు , చిన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.

**మధ్యాహ్నం బయటకు రావద్దు:**
ఉదయం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి, అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రాకూడదని తెలిపారు. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి: దాహం వేయకపోయినా సరే తరచూ నీరు తాగుతుండాలి. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ లవణాల మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల వడదెబ్బ బారిన పడకుండా ఉండవచ్చు. దుస్తుల ఎంపిక: బయటకు వెళ్లేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలి. తలకు టోపీ, రుమాలు లేదా గొడుగు తప్పనిసరిగా ఉపయోగించాలి. కంట్రోల్ రూమ్ నెంబర్ 6281492368 కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

## పోలీస్ దర్బార్ నిర్వహించిన జిల్లా ఎస్పీ డా.శబరీష్



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బందితో పోలీస్ దర్బార్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఏ.ఆర్ డిఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, ఆర్.ఐలు సోములు, భాస్కర్, అనిల్, నాగేశ్వర్రావు, ఆర్.ఎస్.ఐలు,ఏఆర్ ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ పోలీసు శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీ బందోబస్తు విధులు, ఎన్నికల డ్యూటీలు, ప్రజా భద్రత విధులు, ప్రత్యేక ఆపరేషన్లు, పండుగల సమయంలో నిర్వహించే బందోబస్తు వంటి కీలక బాధ్యతలను ఏఆర్ సిబ్బంది సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. ఇదే క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు కొనసాగించాలని సూచించారు.పోలీస్ శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచే విధంగా ప్రతి పోలీస్ సిబ్బంది నిజాయితీతో పనిచేయాలని,శాఖలో అవినీతికి ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా రాజీ ఉండదని హెచ్చరించారు.రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ మార్గదర్శకాల మేరకు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.సిబ్బంది సంక్షేమం పట్ల జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, వసతి, డ్యూటీ సమయాలకు సంబంధించిన అంశాలను అధికారులకు నేరుగా తెలియజేయాలని సూచించారు. సమస్యలను పెండింగ్లో ఉంచకుండా దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా నర్సింహా చారి..




ప్రజాస్ఫూర్తి , జన్నారం : అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జన్నారం మండల కేంద్రానికి చెందిన కడార్ల నరసింహ చారిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారి నియామక పత్రం అందజేశారు.విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతి తరపున ఎన్నో సంవత్సరాలుగా సంఘానికి సేవలందిస్తున్నారు, నిస్వార్థంగా, నిజాయితీగా సేవలందిస్తున్న వారిని గుర్తించి వారికి సముచితమైన స్థానం కల్పిస్తున్నామని నౌండ్ల సంతోష్ చారి పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వలిగొండలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండల కేంద్రంలో గురువారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మెయిన్ రోడ్డు పై ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, ఉప సర్పంచ్ మలుగ మాధవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నరసింహ, జిల్లా కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్, నాయకులు తుమ్మల యుగంధర్ రెడ్డి, చిలుగూరు సత్తిరెడ్డి, కాసుల వెంకన్న, కొండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ మహబూబాబాద్ పట్టణంలోని దీప్తి హాస్పిటల్, పొనుగోటి హాస్పిటల్,వెన్నెల హాస్పిటల్, వీరభద్ర హాస్పిటల్స్ ని ఆకస్మికం గా తనిఖీ చేశారు. డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ రోగుల ప్రయోజనార్థం ప్రతి సేవకు సంబంధించిన రుసుములు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను స్థానిక భాషతో పాటు ఆంగ్ల భాషలో కూడా స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని,క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బయోమెడికల్, పొల్యూషన్, బి తదితర అవసరమైన లైసెన్సులను స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని తెలిపారు. కన్సల్టెంట్ వైద్యుల జాబితాను స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని అగ్నిమాపక శాఖ (112), పోలీస్ (100), అత్యవసర సేవలు (108) వంటి అత్యవసర మొబైల్ నంబర్లను సంస్థ ప్రాంగణంలో ప్రదర్శించాలని, సూచనల కోసం అవసరమైన సైన్ బోర్డులను ప్రదర్శించాలని, రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటించనట్లయితే ఏ సమయంలోనైనా రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని అన్నారు.స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టు మాత్రమే గర్భవతులకు స్కానింగ్ చేయాలని,లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత ఆడ, మగ అని తెలుపుట చట్టరీత్యా నేరమని, అన్ని స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేసే గదిలో వేచియుండు హాలులో తప్పకుండా ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు. అనే బోర్డు పెట్టాల్సిందిగా ఆదేశించారు, ఫామ్ ఎఫ్ ఏరోజువి ఆ రోజే ఆన్లైన్ చేయాలని, ఆన్లైన్ చేసిన అన్ని ఫారంఎఫ్ లు అన్నీ ప్రతినెల 5వ తారీఖు లోపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. హాస్పిటల్ మేనేజ్మెంట్ వారు దరల పట్టికను ప్రదర్శించాలని, ఫైర్ సేఫ్టీ మెసర్స్ కు సంభందించిన పరికరాలను అమర్చుకోవాలని పేరుకొన్నారు.ఈ కార్యక్రమం లో ఇన్చార్జ్ పి ఓఎంహెచ్ఎన్ డాక్టర్ విరాజిత, లోక్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్ కోచింగ్

**: ఎంజేపీ గురుకులాలపై మంత్రి పొన్నం కీలక ఆదేశాలు**



హైదరాబాద్ : తెలంగాణలోని మహాత్మా జ్యోతిరావు పూలే (MJP) బీసీ గురుకుల పాఠశాలలను దేశంలోనే రోల్ మోడల్గా తీర్చిదిద్దాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం జరిగిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 100 శాతం రిజల్ట్స్ సాధించిన స్కూల్స్ ప్రిన్సిపాల్స్ను అభినందించిన మంత్రి.. ఫలితాలు తగ్గిన వారికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. తదుపరి విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు రాబట్టాలని స్పష్టం చేశారు.

**బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలి**

ఇతర రాష్ట్రాల వారు సైతం మన విద్యావిధానాన్ని చూసి నేర్చుకునేలా ఎంజేపీ (MJP) కి ఒక ప్రత్యేక "బ్రాండ్ ఇమేజ్" క్రియేట్ చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థులను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా ఆటలు, కల్చరల్ యాక్టివిటీస్తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), సైన్స్ రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా 8వ తరగతి నుంచే విద్యార్థులను NEET, EAMCET వంటి కాంపిటేటివ్ ఎగ్జామ్స్కు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.

**విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలి**

ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తోందని మంత్రి గుర్తుచేశారు. ప్రైవేట్ అద్దె భవనాల్లో ఉన్నప్పటికీ బేసిక్ ఫెసిలిటీస్ (టాయిలెట్స్, ఫ్యాన్స్ తదితర మౌలిక సదుపాయాలు) కల్పించాల్సిన పూర్తి బాధ్యత ప్రిన్సిపాల్స్దే అన్నారు. తల్లిదండ్రుల కంటే టీచర్ల దగ్గరే పిల్లలు ఎక్కువ సమయం గడుపుతారు కాబట్టి, వారిని సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో జరిగే సూసైడ్స్ను అడ్డుకునేలా విద్యార్థుల్లో మోటివేషన్ నింపాలని, ధైర్యం కల్పించాలని సూచించారు.

**రిజల్ట్స్ పై సమీక్ష.. నెక్స్ట్ ప్లాన్ ఇదే**

ఈ ఏడాది 10వ తరగతిలో 98.45% పాస్ పర్సంటేజ్ రాగా, 204 స్కూల్స్ 100% రిజల్ట్స్ సాధించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్ సెకండియర్లో 90.31%, ఒకేషనల్ సెకండియర్లో 97.72%, ఫస్టియర్లో 85.80% ఉత్తీర్ణత నమోదైంది. ఉత్తీర్ణత శాతం తగ్గిన స్కూల్స్ ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# ప్లాట్ కొనాలంటే ఎన్నారైలు భయపడుతున్నారు

**: న్యూజెర్సీలో హరీశ్ రావు వ్యాఖ్యలు**




అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు తెలంగాణ ప్రస్తుత రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. న్యూజెర్సీలోని హల్దీ మౌంట్ లారెల్లో ( ఎన్నారైలు ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్' (Meet and Greet) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సమకాలీన అంశాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఎన్నారైలతో ఆయన విస్తృతంగా చర్చించారు.

**విజన్ లేని పాలనతో ఇబ్బందులు**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రతీ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్లే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని హరీశ్ రావు గుర్తుచేశారు. ఒకప్పుడు కరువు ప్రాంతంగా ఉన్న తెలంగాణ.. కేసీఆర్ పాలనలో పంజాబ్ రాష్ట్రాన్ని మించి ధాన్యం ఉత్పత్తి చేసి రికార్డులు సృష్టించిందని అన్నారు. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో విజన్ (Vision) లేని రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతోందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు.

**రియల్ ఎస్టేట్ ఢమాల్.. ఎన్నారైల భయం**

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ (Real Estate) రంగం కుదేలైందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ఎలా ఉందంటే.. తెలంగాణలో కనీసం ఒక్క ప్లాట్ (Plot) కొనాలన్నా కూడా ఎన్నారైలు (NRIs) సైతం భయపడిపోయే వాతావరణం నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు.

# అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



* **రూ.4.02 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన**
* **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

పాలేరు, ప్రజా స్ఫూర్తి : ఏదులాపురం మున్సిపాలిటీ ప్రజల సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ 14వ వార్డు పరిధిలోని తెల్దారుపల్లి నుంచి రాముడు చెరువు మీదుగా ఖమ్మంకోదాడ రహదారి వరకు రూ.4.02 కోట్ల వ్యయంతో చేపట్టనున్న [illegible] కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెల్దారుపల్లి ప్రాంతంలో ఇప్పటికే రూ.9 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, తాజా రోడ్డు నిర్మాణంతో స్థానికులకు రవాణా ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల హామీలన్నింటినీ ప్రభుత్వం క్రమ పద్ధతిలో నెరవేరుస్తోందని.. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

**త్వరలోనే కొత్త ఆసరా పింఛన్లు..**

రాబోయే మంత్రివర్గ సమావేశంలో కొత్త ఆసరా పింఛన్ల మంజూరుపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి వెల్లడించారు. నిరుద్యోగ యువతకు ఇప్పటికే 72 వేల ఉద్యోగాలు కల్పించామని, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడంతో పాటు సన్నధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నామని వివరించారు. గురుకుల విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ లో చైన్ స్నాచింగ్

* **పెన్షన్ ఆశ చూపి వృద్ధురాలి బంగారు గొలుసు అపహరణ.**
* **90 నిమిషాల్లోనే కేసును చేదించిన హుస్నాబాద్ పోలీసులు.**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : పెన్షన్ ఇప్పిస్తానంటూ నమ్మించి వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ను దొంగిలించిన నిందితుడిని హుస్నాబాద్, సీసీఎస్ పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో కేవలం గంటన్నర వ్యవధిలోనే పట్టుకుని కటకటాల వెనక్కి నెట్టారు.పోలీసుల కథనం ప్రకారం.అల్లెపు కృష్ణ అనే నిందితుడు అయిలేని లక్ష్మీ (76) అనే వృద్ధురాలిని సమీపించి, ఆమెకు ప్రతి నెలా రూ. 4,000 పెన్షన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. గాయత్రి బ్యాంకులో రద్దీ ఎలా ఉందో చూసి వస్తానని చెప్పి వెళ్లిన నిందితుడు, తిరిగి వచ్చి బ్యాంకులో ఒక వ్యక్తి ఫోటో దిగడానికి పుస్తెలతాడు కావాలని నమ్మించాడు. ఫోటో తీయగానే తెచ్చి ఇస్తానని మాయమాటలు చెప్పి, ఆమె మెడలోని దాదాపు రెండున్నర తులాల బంగారు చైన్ను తీసుకుని అక్కడి నుండి పరారయ్యాడు.బాధితురాలు లక్ష్మి సమాచారం అందించిన వెంటనే హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, కానిస్టేబుల్ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీఎస్ ఇన్స్పెక్టర్ పెండ్యాల దేవేందర్ తన బృందంతో కలిసి నేర స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడిని గుర్తించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో కేవలం ఒకటిన్నర గంటల వ్యవధిలోనే హుస్నాబాద్ బస్టాండ్ వద్ద నిందితుడైన అల్లెపు కృష్ణను పోలీసులు విజయవంతంగా అదుపులోకి తీసుకున్నారు. హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందము పర్యవేక్షణలో అత్యంత వేగంగా ఈ కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రవీందర్, సీసీఎస్ ఎస్ఐ తిరుపతి, హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, నగేష్, మరియు కానిస్టేబుల్ నరేష్లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ (ఐపీఎస్) ప్రత్యేకంగా అభినందించారు. ఈ నేరం ఇంత త్వరగా వెలుగు చూడటానికి సీసీ కెమెరాలే ముఖ్య కారణమని, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమైనందున ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద, వ్యాపార సంస్థల్లో వీటిని ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు కోరారు.

## రేవంత్ అబద్ధం చెప్పారా లేక
# బండి సంజయ్ అబద్ధం చెప్పారా?

**: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

* **తన కొడుకుని తానే పోలీసులకు అప్పగించానన్న బండి సంజయ్**
* **భగీరథ్ను పోలీసులే అరెస్ట్ చేశారన్న రేవంత్ రెడ్డి**
* **ఇద్దరిలో ఎవరు చెప్పింది నిజమన్న ప్రవీణ్ కుమార్**



పోక్సో కేసు నిందితుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్ట్ వ్యవహారం ఒక పెద్ద రాజకీయ రచ్చకు దారితీసింది. ఈ అరెస్ట్పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్పై బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. తెలంగాణ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అసలు జరిగింది పోలీసు అరెస్ట్ కాదా? లాయర్ల సమక్షంలో జరిగిన సరెండరా? ఏది నిజం? అని ప్రశ్నించారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అబద్ధం చెబుతున్నారా.. లేక కేంద్ర మంత్రి బండి సంజయ్ అబద్ధం చెబుతున్నారా? అని ఆయన నిలదీశారు.అసలేం జరిగిందంటే... ఈరోజు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... "రోడ్డు మధ్యలో నాకాబందీ నిర్వహించి మరీ బండి భగీరథ్ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో రాజకీయం లేదు, పోలీసుల మాట నమ్మాలి" అని స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా నిన్న బండి సంజయ్ స్పందించారు. "నేనొక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రిగా, రాజకీయ నాయకుడిగా నా కొడుకును నేనే నా లాయర్ల ద్వారా పోలీసులకు సరెండర్ చేశాను" అని చాలా స్పష్టంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో "మనం రాష్ట్ర ముఖ్యమంత్రిని నమ్మాలా? లేక దేశ హోంశాఖ సహాయ మంత్రిని నమ్మాలా?" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ..
## ఎన్నాళ్లీ మొద్దు నిద్ర అని ప్రశ్న!



హైదరాబాద్: తెలంగాణలో ప్రస్తుతం పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతల సమస్యలపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కొండంత ధైర్యంతో బతికిన సాగు రంగాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం కొద్ది నెలల్లోనే కన్నీటి సేద్యంగా మార్చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే వారాల తరబడి పడిగాపులు కాస్తూ, గుండెపగిలి కుప్పకూలుతున్నా ప్రభుత్వానికి కనీస సోయి లేదని కేటీఆర్ విమర్శించారు.

ముఖ్యమంత్రి తన కుర్చీని కాపాడుకోవడానికి 70 సార్లు ఢిల్లీ చుట్టూ తిరగడంపై ఉన్న శ్రద్ధలో ఒక్క శాతం కూడా రైతులపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద ఎండ తీవ్రతకు, వడదెబ్బకు తోడు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం వల్ల దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని లేఖలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా ఎక్కడ చూసినా రోజుకు కనీసం ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని, అడపాదడపా కొనే చోట కూడా క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచే రూ. 50 డిపాజిట్ వసూలు చేసే దుస్థితి తేవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మూడు నెలల ముందే ప్రణాళికలు వేసి, కరోనా కష్టకాలంలోనూ రైతుల కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా భరోసా ఇచ్చారని కేటీఆర్ నీపేర్కొన్నారు.

# నిప్పుల కుంపటిగా తెలుగు రాష్ట్రాలు.. పిడుగురాళ్లలో 48 డిగ్రీలు

హైదరాబాద్: ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. జిల్లాల వారీగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు కింది పట్టికలో..

# దండు మల్కాపురంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సుక్క రవీందర్ ఆదేశాల మేరకు చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో రాజీవ్ గాంధీ విగ్రహానికి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్, చౌటుప్పల్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.డీ.గౌస్ ఖాన్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనిమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఈడుదుల ఇంద్రసేన యాదవ్, పక్కిర్ వంశీధర్ రెడ్డి,ఉప్పరి అనిల్ కుమార్, అత్తాపురం సంతోష అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి పక్కిర్ ప్రభాకర్ రెడ్డి, ఆంధోళ్ మైసమ్మ, రామలింగేశ్వర స్వామి దేవస్థానాల డైరెక్టర్లు జొన్నగంటి దాసు, మన్నె మహేందర్ రెడ్డి, బొంతల యువరాజ్, సిలువేరు శంకర్, ఎల్లంకి లింగచారి, దౌడి లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈద్దుల హరిప్రసాద్, మహ్మద్ గాలీబ్ ఖాన్, ఎం.డీ.బాబా, సిలువేరు బాలయ్య, ఈద్దుల జంగయ్య, చామట్ల ప్రభాకర్, ఈద్దుల కేశవ్ యాదవ్, ఈద్దుల పరమేష్ యాదవ్, ముదిగొండ మహేష్, చందుపట్ల సాయి నేత, మహంకాళి పృథ్వి, సందగళ్ల నవీన్ గౌడ్, షేక్ అహ్మత్, రహ్మత్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై సీఎం వ్యాఖ్యలు సిగ్గుచేటు

**: రాంచందర్రావు**




హైదరాబాద్ : మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం మోదీ ప్రభుత్వం రాజీవ్ గాంధీని చూసి స్ఫూర్తి పొందాలని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు కేవలం గర్హనీయమే కాకుండా అత్యంత విడ్డూరంగా ఉన్నాయని బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్రావు విమర్శించారు. రాజీవ్ గాంధీ 400కు పైగా ఎంపీ స్థానాలతో తిరుగులేని మెజారిటీతో ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు.. ఆ అఖండ బలాన్ని మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడానికి ఏమాత్రం ఉపయోగించలేదన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కౌంటరిచ్చారు.

**ఏకంగా ఏడుసార్లు..**

షా బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును పక్కదారి పట్టించారు. విడాకులు తీసుకున్న ఒక ముస్లిం మహిళకు దక్కాల్సిన న్యాయమైన భరణాన్ని వారి ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. మహిళా హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ అసలు ట్రాక్ రికార్డ్ ఇదే. దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లును జాప్యం చేసింది.. అడ్డుకుంది.. వీగిపోయేలా చేసింది. అది ఒక్కసారి కాదు.. ఏకంగా ఏడుసార్లు. అలాంటి చరిత్ర పెట్టుకుని నేడు ఆ పార్టీ నాయకులు ప్రధాని మోదీకి మహిళా సాధికారతపై నీతులు చెప్పడం సిగ్గుచేటు. మహిళా సాధికారత విషయంపై మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం లేదు అని రాంచందర్రావు మండిపడ్డారు.

# 21 మంది జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సాయం

**: మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్రెడ్డి**



జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 5వ సమావేశం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన, దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన నలుగురు జర్నలిస్టులకు కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసిందన్నారు. మరణించిన 17 మంది జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామన్నారు.

# ఆమ్‌చూర్‌ను డ్రగ్స్‌గా భావించి జైలుకు.. బాధితుడికి రూ.10 లక్షల పరిహారం


జబల్‌పూర్: చేయని నేరానికి ఓ వ్యక్తి 57 రోజుల జైలు జీవితం గడిపారు. దీనిపై దాదాపు 15 ఏళ్లు న్యాయపోరాటం చేశారు. ఎట్టకేలకు కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. గ్వాలియర్‌కు చెందిన అజయ్ సింగ్ అనే ఇంజినీర్.. 2010 మేలో దిల్లీకి వెళ్లేందుకు భోపాల్ విమానాశ్రయానికి చేరుకున్నారు. తనిఖీల సమయంలో.. ఆయన లగేజీలోని ఆమ్‌చూర్, మసాలా పొడుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు ఉన్నట్లు ఈటీడీ యంత్రం గుర్తించింది. దీంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ పొడుల శాంపిళ్లను పరీక్షించేందుకు తొలుత ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అయితే, తమవద్ద అవసరమైన సదుపాయాలు లేవని పేర్కొంటూ.. 10 రోజుల తర్వాత ఆ నమూనాలను ల్యాబ్ తిప్పి పంపింది. ఆపై హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపించారు. ఆ శాంపిళ్లలో



ఎటువంటి నిషేధిత పదార్థాలూ లేవని ల్యాబ్ రిపోర్టు వచ్చింది. దీంతో 57 రోజులకు ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. ఈటీడీ యంత్రం పనితీరులో లోపమే ఈ పరిస్థితికి కారణమైందని పోలీసులు ట్రయల్ కోర్టుకు తెలిపారు. అదే ఏడాది డిసెంబర్ 2న న్యాయస్థానం ఆయన్ను నిర్దోషిగా విడుదల చేసింది. అన్యాయంగా తనను జైలులో ఉంచారంటూ.. 2011లో ఆయన మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు పరిహారం చెల్లించేలా ఆదేశించాలని కోరారు. ఈ వ్యవహారాన్ని పిటిషనర్ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా పరిగణిస్తూ.. ఆయనకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని హైకోర్టు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా అన్ని ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్‌లను ఒక నెలలోగా తనిఖీ చేయాలని సీఎస్‌ను ఆదేశించింది.

## మెలోడీ మీమ్ ట్రెండ్..
# తపాలా శాఖ నుంచి ట్రెండీ పోస్ట్

ప్రధాని మోదీ ఇటలీ ప్రధాని మెలోనీల స్నేహానికి గుర్తుగా వాడుతున్న పదం 'మెలోడీ'. మోదీ మెలోనీకి మెలోడీ టాఫీలు ఇచ్చిన వీడియో కూడా నిన్నటి నుంచి సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా మీమ్స్ వస్తున్నాయి. తాజాగా ఇండియా పోస్టు కూడా ఈ బజ్‌లో భాగమైంది. తన #24 స్పీడ్ పోస్టు సేవల ప్రచారం కోసం 'మెలోడీ' మీమ్‌ను వాడుకుంది. మెలోడీ టాఫీల ప్యాకెట్‌ను 'దీన్ని మరుసటి రోజు కల్లా ఆమెకు ఎలా డెలివరీ చేయాలి?' అంటూ




ఒక పోస్టర్.. తర్వాతి రోజు చేరవేయడానికి '#24 స్పీడ్ పోస్ట్ ఉందిగా!' అంటూ మరో పోస్టర్‌ను ఇండియా పోస్ట్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది.

## బాడీ షేమింగ్ పోస్ట్.. సారా తెండూల్కర్ ఆగ్రహం

దిగ్గజ క్రికెటర్ సచిన్ తెండూల్కర్ కుమార్తె సారా తెండూల్కర్ ఒక వీడియోగ్రాఫర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. తనను బాడీషేమింగ్ చేస్తూ ఉన్న రీల్‌ను పోస్టు చేయడంపై మండిపడ్డారు. సారా, తన మరదలు సానియా చందోక్ (అర్జున్ భార్య)తో కలిసి ఉన్న ఆ వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టింది. అది ఆమె దృష్టికి రావడంతో తీవ్రంగా స్పందించారు. ఆ వీడియోలోని దృశ్యాలను తన ఇన్‌స్టా స్టోరీలో సారా షేర్ చేశారు. ''ఇది చాలా అసహ్యకరమైన కామెంట్. ఇది జర్నలిజం



కాదు. మమ్మల్ని ఇలా వదిలేయండి. మీరు తర్వాత ఈ పోస్టు డిలీట్ చేయొచ్చు. అంతమాత్రాన మీ తప్పు సరిదిద్దుకున్నట్టు కాదు'' అని ఆమె రాసుకొచ్చారు. కాగా.. సారా ఇన్‌స్టాలో చురుగ్గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన లైఫ్‌కు సంబంధించి అప్‌డేట్ షేర్ చేస్తూ.. ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటారు. ఇటీవల తన సోదరుడు అర్జున్ వివాహ వేడుకకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెటిజన్లతో పంచుకున్నారు. ఆమె ఇన్‌స్టా ఖాతాకు 90 లక్షలమందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు.

## 'రెడ్ జోన్'లోకి చమురు మార్కెట్లు..
# IEA చీఫ్ హెచ్చరిక


ప్రపంచవ్యాప్తంగా ఇంధన నిల్వలు తరిగిపోవడం, వేసవి సీజన్‌లో ప్రయాణాల డిమాండ్ వల్ల చమురు మార్కెట్లు త్వరలోనే 'రెడ్ జోన్'లోకి ప్రవేశించే అవకాశం ఉందని 'అంతర్జాతీయ ఇంధన సంస్థ' (ఐఈఏ) చీఫ్ ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. ఇరాన్ యుద్ధం వల్ల తలెత్తిన ఈ ఇంధన సంక్షోభానికి.. హర్మూజ్ జలసంధిని పూర్తిగా, బేషరతుగా తిరిగి తెరవడమే పరిష్కార మార్గమని చెప్పారు. ''హర్మూజ్‌ను తిరిగి తెరవడంలో విఫలమైతే.. పశ్చిమాసియా నుంచి సరఫరాలు లేక ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు తగ్గిపోతాయి. సంక్షోభం ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా మిగులు నిల్వలు



ఉన్నప్పటికీ.. ప్రస్తుతం అవి క్షీణిస్తున్నాయి. దీనికి తోడు వేసవి సీజన్‌లో ప్రయాణాల డిమాండ్ పెరగడం వంటి కారణాలతో జులై లేదా ఆగస్టులో చమురు మార్కెట్లు 'రెడ్ జోన్'లోకి ప్రవేశించవచ్చు'' అని ప్రపంచ ఇంధన భద్రతపై లండన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బిరోల్ వ్యాఖ్యానించారు.

## నౌకను నీటి అడుగున చేర్చి..
# దేశంలో తొలి అండర్‌వాటర్ మ్యూజియం!

దేశంలో తొలి అండర్‌వాటర్ మ్యూజియం ఏర్పాటుకు పనులు మొదలయ్యాయి. మహారాష్ట్రలో సింధుదుర్గ్ జిల్లాలోని నివతి ప్రాంతంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం గతంలో భారత నౌకాదళంలో విధులు నిర్వహించిన 'ఐఎన్ఎస్ గుల్దార్' అనే యుద్ధనౌకను తీరానికి కొద్ది దూరంలో 22 మీటర్ల లోతు నీటి అడుగు భాగంలో చేర్చారు. మహారాష్ట్ర పర్యాటకశాఖ అధికారులు ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కృత్రిమ పగడపు దిబ్బలు, సబ్‌మెరైన్ టూరిజం వంటి పర్యాటక ఆకర్షణలూ తీసుకురానున్నట్లు తెలిపారు. ''మహారాష్ట్ర మారిటైమ్ బోర్డు, సీఎస్ఐఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ నిపుణుల శాస్త్రీయ పరిశోధనల అనంతరం ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నాం. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.46.91 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.112.46 కోట్లు కేటాయించేందుకు ముందుకొచ్చాయి.



నౌకను నీటి లోపలికి చేర్చేముందు శుద్ధి ప్రక్రియ నిర్వహించాం. ప్రమాదకరమైన, కాలుష్యకారక వస్తువులన్నీ తొలగించాం. సముద్ర జీవుల పెరుగుదలకు ఈ నౌక ఒక కృత్రిమ దిబ్బగా పనిచేస్తుంది. స్కూబా డైవింగ్, అండర్‌వాటర్ ఫొటోగ్రఫీ, సముద్ర జీవావరణ కార్యకలాపాల పరిశీలన వంటి కార్యక్రమాలతో పర్యాటకులకు సరికొత్త అనుభవం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సముద్రంలో డైవింగ్ చేయని వారి కోసం జలాంతర్గామి సదుపాయాన్ని కూడా తీసుకొస్తాం. ఇది ఒకటిన్నరేళ్లలో కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. సముద్ర జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు.. నౌక ఉన్న ప్రదేశానికి 500 మీటర్ల పరిధిలో చేపల వేట, లంగరు కార్యకలాపాలపై ఆంక్షలు విధించాలని ప్రతిపాదించాం'' అని అధికారులు వెల్లడించారు.

# ఝార్ఖండ్‌లో 27 మంది మావోయిస్టుల లొంగుబాటు..!

ఝార్ఖండ్‌లో నేడు భారీ సంఖ్యలో మావోయిస్టులు ఆ రాష్ట్ర డీజీపీ తదాషా మిస్త్రీ సమక్షంలో లొంగిపోయారు. మొత్తం 27 మంది మావోలు ఝార్ఖండ్ పోలీసు సీనియర్ అధికారుల ఎదుట ఆయుధాలతో లొంగిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇది ఝార్ఖండ్ చరిత్రలోనే రికార్డు. వీరిలో చాలామంది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు కూడా ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్



నవజీవన్‌కు ప్రభావితమై వీరు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు వెల్లడించారు. 2026లో రాష్ట్రంలో 22 మంది మావోయిస్టులను మట్టుబెట్టగా.. 44 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 29 మంది లొంగిపోయారన్నారు. మిగిలినవారు జనజీవన స్రవంతిలోకి చేరినట్లు పేర్కొన్నారు. నేడు లొంగిపోయిన 27 మందికి పునరావాసం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు.

*** లొంగిపోయిన వారిలో**

**మిశ్ర్ బస్త ఉన్నారా..?**

నేడు మావోయిస్టు పార్టీ చివరి యాక్టివ్ పొలిట్ బ్యూరో సభ్యుడు మిశ్ర్ బస్త్ర అలియాస్ సాగర్‌జీ కూడా ఉండే అవకాశం ఉందని తొలుత మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటివరకు అధికారుల నుంచి వెలువడిన ప్రకటనలో ఆయన పేరు ప్రస్తావన లేదు. తాజాగా లొంగిపోయిన వారిలో ఆయన సన్నిహిత బృందంలోని టాప్ కమాండర్లు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది.

# పుల్వామా దాడుల కీలక సూత్రధారి హతం..

పుల్వామా ఉగ్రదాడి కీలక సూత్రధారి హమ్జా బుర్హాన్ హతమయ్యాడు . పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తులు అతడిని కాల్చిచంపారు. పుల్వామాకు చెందిన బుర్హాన్ ఉన్నత విద్యను అభ్యసించే నెపంతో 2017లో పాకిస్థాన్‌కు వెళ్లాడు. తర్వాత నిషేధిత ఉగ్రవాద సంస్థ అల్ బదర్‌లో చేరి, కొద్ది కాలంలోనే కమాండర్ స్థాయికి ఎదిగాడు. 2022లో భారత్ అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. 2019, ఫిబ్రవరి 14న సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు



అమరులైన సంగతి తెలిసిందే . ఈ ఉగ్రదాడి ఘటన వెనక పాకిస్థాన్ హస్తం గల ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ ఉన్నట్లు భారత నిఘాసంస్థలు గుర్తించాయి. దీనికి ప్రతీకారంగా భారత వాయుసేన ఫిబ్రవరి 26న వైమానిక దాడులు చేపట్టింది. పాక్ భూభాగంలోని బాలాకోట్‌లోని జైషే మహ్మద్ ఉగ్ర స్థావరాలపై తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. ఆ తర్వాత పాక్ ప్రతీకార దాడులు చేపట్టింది మన గగనతలంలోకి వారి యుద్ధ విమానాలు దూసుకొచ్చాయి. అయితే పాక్ చర్యను భారత వాయుసేన సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఈ క్రమంలో మన మిగ్ విమానం ఒకటి కూలి వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ శత్రుచెరలో చిక్కుకుపోయారు. అయితే అంతర్జాతీయ ఒత్తిడితో మూడు రోజుల తర్వాత అభినందన్‌ను పాక్ విడిచిపెట్టింది.

# రూబీ సీతాఫలం..!

**సపోటా పొడుగ్గా ఉంటే... వెలక్కాయ తియ్యతియ్యగా నోరూరిస్తే... సీతాఫలం గులాబీ రంగులో కనిపిస్తే... కాస్త ఆశ్చర్యమే కదూ. సరికొత్త ఆ వెరైటీ పండ్ల వివరాలేంటో తెలుసుకుందాం పదండి మరి!**



ఏడాదంతా ఎన్ని రకాల పండ్లు దొరికినా... సీతాఫలాల సీజన్ కోసం కొంతమంది ప్రత్యేకంగా ఎదురుచూస్తుంటారు. పండు నిండా గింజలు ఉన్నా ఓపిగ్గా వాటిని తీసుకుంటూనే దాని తీపి గుజ్జును ఆస్వాదించేస్తుంటారు. పిల్లలైతే కమ్మటి ఈ పండును లొట్టలేసుకుంటూ తినేస్తారు. కొత్తగా ఈ సీతాఫలాల్లో కేకు రుచిలో, గులాబీఎరుపు రంగులో, రూబీ రెడ్ కస్టర్డ్ యాపిల్ వెరైటీ పండ్లూ దొరుకుతున్నాయి. చూడ్డానికి కంటికింపుగా ఉండటంతోపాటు తక్కువ గింజలతో ఉండే ఈ పండులో తియ్యదనమూ ఎక్కువేనట. అందుకే స్మూతీల తయారీలో, స్వీట్ల గార్నిషింగ్‌లోనూ దీన్ని వేస్తుంటారు. మామూలు సీతాఫలాలతో పోలిస్తే వ్యాధినిరోధక శక్తిని పెంచే గుణం వీటికి ఎక్కువగా ఉంటుందట. జలుబూ, ఇతర వ్యాధుల నుంచి రక్షణ కోసం వీటిని తింటే సరి.

**తియ్యటి వెలక్కాయ!**

కాస్త వగరుగా, మరికాస్త పుల్లగా ఉండే వెలక్కాయ రుచి అందరికీ తెలిసిందే. అయితే ఫ్రూట్ సలాడ్, మిఠాయిల్లాంటివాటిల్లో ఈ పండును చేర్చుకోలేం. అంతసులువుగా దీన్ని తినలేం కూడా. కానీ ఈ థాయ్ వెలక్కాయని మాత్రం ఆ ఇబ్బంది లేకుండా సులువుగా తినొచ్చు. ఎందుకంటే మనసుని కట్టిపడేసే సువాసనతో ఉండే ఈ వెలక్కాయ జ్యూసీ జ్యూసీగా మెత్తటి గుజ్జుతో నోరూరిస్తుంది. అంతేకాదు, తియ్యగా ఉండటమే ఈ పండు అసలైన విశేషం. ఈ హైబ్రిడ్ రకాన్ని థాయ్‌లాండ్‌లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. మన దగ్గరా ఈ కొత్త రకం వెలగ మొక్కలను పెంచుతున్నారు. చలికాలంలో వచ్చే వైరల్ ఇన్‌ఫెక్షన్లను దూరం చేసే ఈ పండుతో పచ్చడి పెడితే అద్భుతమైన రుచీ ఉంటుంది.. పోషకాలూ అందుతాయి.

**బనానా సపోటా!**

మామూలుగా సపోటా అనగానే గోధుమ రంగు తోలుతో గుండ్రంగా ఉండే పండే గుర్తుకొస్తుంది ఎవరికైనా. కానీ ఇక్కడున్న పండును కాస్త గమనించండి. చిన్న అరటి పండులా పొడుగ్గా కాస్త





చిత్రంగా ఉంది కదూ. ఆ వింత రూపం వల్లే దీన్ని బనానా సపోటా అని పిలుస్తారు. ఈమధ్య నర్సరీల్లో, మిద్దె తోటల్లో ఈ బనానా సపోటా వెరైటీని ఎక్కువగా పెంచుతున్నారు. మెక్సికో, మధ్య అమెరికాకు చెందిన ఈ పండు ఒక్క ఆకృతిలోనే కాదు, రుచిలోనూ ప్రత్యేకమైందే. మిగిలిన సపోటాల కన్నా ఎంతో తియ్యగా చాక్లెట్‌లా ఉంటుందీ పండు. నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే ఈ బనానా సపోటాని మిల్క్‌షేక్స్, స్వీట్లూ, ఐస్‌క్రీమ్‌ల తయారీల్లో విరివిగా వాడుతుంటారు. సపోడిల్లాగానూ పిలిచే ఈ పండులో రక్తపోటుని అదుపుచేసే పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అదొక్కటే కాదు మామూలు సపోటాతో పోలిస్తే దీనిద్వారా పీచు, విటమిన్ సి, ఐరన్, యాంటీఆక్సిడెంట్లలాంటి పోషకాలూ అధికంగా అందుతాయట.



**ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లాలనుకునే యాత్రికులకు ఐఆర్‌సీటీసీ గుడ్ న్యూస్ చెప్పింది. 'సప్త జ్యోతిర్లింగ్ దర్శన్ యాత్ర' పేరుతో ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. ఒకే యాత్రలో ఏకంగా 7 జ్యోతిర్లింగాలను దర్శించుకునే అవకాశం కల్పిస్తోంది. అది కూడా చాలా తక్కువ ఖర్చుతో ఈ ప్యాకేజీని ప్రకటించింది. రూ.17,600 నుంచే ప్యాకేజీ ధరలు ప్రారంభం కానున్నాయి. చిన్నారులకు ప్రత్యేక రాయితీ ధరలు కూడా అందుబాటులో ఉన్నాయి.**

# 7 జ్యోతిర్లింగాల దర్శనం..
# రూ.17,600కే

## ఐఆర్‌సీటీసీ గుడ్‌న్యూస్.. సికింద్రాబాద్ నుంచి టూర్ స్టార్ట్



ఈ యాత్రలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్ ఆలయాలతో పాటు గుజరాత్‌లోని ద్వారక, సోమనాథ్, మహారాష్ట్రలోని భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగా (ఛత్రపతి శంభాజీనగర్)లను దర్శించుకునే అవకాశం కల్పిస్తోంది ఐఆర్‌సీటీసీ. మొత్తం 10 రాత్రులు, 11 రోజుల పాటు సాగే ఈ యాత్ర జూన్ 16న సికింద్రాబాద్ నుంచి భారత్ గౌరవ్ టూరిస్టు రైలు (Bharat Gaurav Tourist Train)తో ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటలక సికింద్రాబాద్ స్టేషన్ నుంచి జర్నీ స్టార్ట్ అవుతుంది. ఈ రైలు కామారెడ్డి, నిజామాబాద్ మీదుగా ఉజ్జయిని చేరుకుంటుంది. ఆ తర్వాత అక్కడి నుంచి జ్యోతిర్లింగాల దర్శనాలు కొనసాగుతాయి.




- **ఇవీ ప్యాకేజీ ధరలు..**

ఈ ప్యాకేజీలో ఎకానమీ (స్లీపర్ క్లాస్), స్టాండర్డ్ (3ఏసీ), కంఫర్ట్ (2ఏసీ) అనే మూడు కేటగిరీలు ఉన్నాయి. స్లీపర్ క్లాస్‌లో ఎకానమీ టికెట్ ధర రూ.17,600 నుంచి ప్రారంభమవుతుంది. అదే 5-11 ఏళ్ల మధ్య వయసు గల చిన్నారులకు మాత్రం రూ.16,300 చెల్లించాలి.

3ఏసీ స్టాండర్డ్ ప్యాకేజీ ధర రూ.26,700 ప్రారంభమవుతుంది. చిన్నారులకు రూ.25,200 చెల్లించాలి.

ఇక 2ఏసీ కంఫర్ట్ ప్యాకేజీ ధర రూ.34,600గా నిర్ణయించారు. చిన్నారులకు రూ.32,800 చెల్లించాలి.

యాత్రికులకు హోటల్ బస, శాకాహార భోజనం, స్థానిక రవాణా, ట్రావెల్ ఇన్సూరెన్స్, టూర్ మేనేజర్ సహాయం వంటి సదుపాయాలు ప్యాకేజీలో భాగం. అయితే, ఏ ఆలయం వద్దైనా ఎంట్రీ ఫీజులు ఉంటే మాత్రం ప్రయాణికులే చెల్లించుకోవాల్సి ఉంటుంది. కేవలం యాత్రికుల భద్రత, ప్రయాణ సదుపారం, బస, ఫుడ్ వంటివి మాత్రమే రైల్వే సిబ్బంది చూసుకుంటారు.



### ప్రయాణం సాగుతుందిలా..

జూన్ 16వ తేదీన ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి భారత్ గౌరవ్ రైలు ప్రారంభమవుతుంది. 17న ఉదయం 10 గంటలకు ఉజ్జయిని చేరుకుంటుంది. 18న రోడ్డు మార్గంలో ఓంకారేశ్వర్ వెళ్తారు. రాత్రి 11 గంటలకు రైలు బయల్దేరుతుంది. 19న సాయంత్రం 6:30 గంటలకు ద్వారక రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. 20న ద్వారకాదీశ్ దర్శనం అనంతరం బెట్ ద్వారక, నాగేశ్వర్ జ్యోతిర్లింగ ఆలయాన్ని దర్శిస్తారు. తరువాత రైల్లో 21న ఉదయం 6 గంటలకంతా సోమనాథ్ చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి 22న మధ్యాహ్నం పూణెలోని ఖడ్కికి చేరుకుంటారు. 23న ఉదయం భీమశంకర ఆలయ సందర్శనకు వెళ్తారు. అదేరోజు రాత్రి 11 గంటలకు బయల్దేరతారు. జూన్ 24న ఉదయం 6 గంటలకు నాసిక్ కు చేరుకుని, త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగ ఆలయాన్ని సందర్శిస్తారు. దర్శనానంతరం ఛత్రపతి శంభాజీనగర్‌కు 25న ఉదయం 5 గంటలకు చేరుకుంటారు. ఘృష్ణేశ్వర ఆలయాన్ని సందర్శనతో సప్త జ్యోతిర్లింగ్ దర్శన్ యాత్ర పూర్తవుతుంది. అదే రోజు రాత్రి 10 గంటలకు తిరుగుపయనమవుతారు. 26న సాయంత్రం 7 గంటలకు రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది.





# సినిమా



# గోల్డ్ టాసెల్ గౌన్‌లో మెరిసిన రాశీ ఖన్నా!

సినీ తారల శైలి ఎప్పుడూ వినూత్నమే. సరికొత్త వస్త్రాలంకరణతో మెరిసిపోతూ అభిమానుల కనులకు విందు చేయడం కథానాయికలకు పరిపాటే. తాజాగా అందాల భామ రాశీ ఖన్నా తన సరికొత్త లుక్‌తో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది.

ధగధగలాడే అందం! నిఖార్సైన అభినయంతో పాటు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేసుకున్న ఈ ఢిల్లీ బ్యూటీ.. తాజాగా ఓ ప్రత్యేక వేడుక కోసం బంగారు వర్ణపు (గోల్డ్) టాసెల్ గౌనులో మెరిసిపోయింది. ఒంటిపై నూలిపోగులా ఒదిగిపోయిన ఆ గౌనులో రాశీ జిగేల్‌మంటూ కెమెరాలకు ఫోజులిచ్చింది. మిలమిలా మెరుస్తున్న ఆ దుస్తులకు తగ్గట్లుగా వదులుగా వదిలేసిన కురులు, సున్నితమైన మేకప్ ఆమె అందాన్ని మరింత ద్విగుణీకృతం చేశాయి.

సామాజిక మాధ్యమాల్లో హోరు..

"బంగారు వర్ణపు వెలుగుల్లో.." అంటూ రాశీ ఖన్నా పంచుకున్న ఈ ఛాయాచిత్రాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఆమె రాజసం, శైలికి ముగ్ధులవుతున్న అభిమానులు.. లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'బంగారు బొమ్మ', 'అప్సరసలా ఉంది' అంటూ ప్రశంసలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ.. గ్లామర్ పరంగానూ తనేమీ తక్కువ కాదని మరోసారి నిరూపించింది.




## మెగా మూవీ లాంచ్..

158వ సినిమాను షురూ చేశారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. బాబీ దర్శకత్వంలో రానున్న ఈచిత్రం నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టగా.. చిరు కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్ ఆన్ చేశారు. పలువురు టాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యారు.

## జూన్ 4న వస్తున్న రామ్ చరణ్ పెద్ది... ఇది పక్కా!





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, డైరెక్టర్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రూరల్ యాక్షన్ డ్రామా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను ఈ ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు రామ్ చరణ్ తన సోషల్ మీడియా ఖాతాలో, "జూన్ 4న 'పెద్ది'ని కలవండి. థియేటర్లలో కలుసుకుందాం" అని పోస్ట్ చేశారు. ఈ మేరకు రిలీజ్ పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిన వెంటనే ఈ ప్రకటన రావడం గమనార్హం. మే 1వ తేదీ తెల్లవారుజామున, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు 'పెద్ది' షూటింగ్ పూర్తయినట్టు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌తో తన ప్రయాణం గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "రామ్ చరణ్‌తో 'పెద్ది' ఒక మధురమైన ప్రయాణం. ఆయనతో పనిచేయడం చాలా ప్రత్యేకం. తెరపై పవర్‌హౌస్ పెర్ఫార్మర్, తెర వెనుక అద్భుతమైన స్నేహితుడు. మేమిద్దరం కలిసి సృష్టించిన జ్ఞాపకాలకు కృతజ్ఞతలు" అని రత్నవేలు పేర్కొన్నారు. ప్రతి ఫ్రేమ్‌లో అద్భుతమైన నటనను ప్రదర్శించడమే కాకుండా, నిజ జీవితంలోనూ ఎంతో స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తి అని చరణ్‌ను ఆయన కొనియాడారు. ఈ సినిమా కోసం చివరిగా ఒక స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించినట్టు గతంలోనే వార్తలు వచ్చాయి. హైదరాబాద్‌లో రామ్ చరణ్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఒక సర్‌ప్రైజ్ ఎలిమెంట్ ఉంటుందని యూనిట్ వర్గాలు తెలిపాయి. ట్యూన్, డ్యాన్స్, గ్రాండ్ సెట్, అందులోని సర్‌ప్రైజ్‌తో ప్రేక్షకులు థియేటర్లలో ఉర్రూతలూగడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇది మరో చార్ట్‌బస్టర్ అవుతుందని అప్పట్లో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ సినిమాను ముందుగా విడుదల చేయాలని భావించినా, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం కేటాయించేందుకే జూన్‌కు వాయిదా వేస్తున్నట్టు వారం క్రితం నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ ప్రకటించింది. "మా సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న స్పందన అద్భుతంగా ఉంది. సినిమా టాకీ పార్ట్ పూర్తయింది, కేవలం ఒక పాట మాత్రమే మిగిలి ఉంది. ఎడిట్ చూసుకున్నాం, అవుట్‌పుట్‌తో చాలా సంతోషంగా ఉన్నాం. ఇంత మంచి కంటెంట్‌ను అత్యుత్తమంగా అందించాలనుకుంటున్నాం. అందుకే మా టెక్నీషియన్లకు, పోస్ట్ ప్రొడక్షన్ బృందానికి కాస్త ఎక్కువ సమయం ఇచ్చి, పూర్తి నాణ్యతతో మీ ముందుకు రావాలని నిర్ణయించుకున్నాం" అని ఆ ప్రకటనలో వివరించింది. అందుకే సినిమాను జూన్‌కు వాయిదా వేస్తున్నామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది. ఇప్పుడు ఆ తేదీని ఖరారు చేశారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది'పై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నటులు శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతికంగానూ ఈ సినిమా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కుతోంది. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## 'ధురంధర్' సర్‌ప్రైజ్..
## రెండు ఓటీటీల్లోకి అన్‌కట్ వెర్షన్




రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ధురంధర్'. ప్రస్తుతం దీని రెండో భాగం ఓవర్సీస్‌లో ఓటీటీలో విడుదలై భారీ వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో టీమ్ ఓ సర్‌ప్రైజ్‌ను ప్రకటించింది. 'ధురంధర్' మొదటి భాగం అన్‌కట్ వెర్షన్‌ను ఓటీటీలో అందుబాటులోకి తెచ్చింది. రెండు ఓటీటీల్లోనూ ఒకేరోజు ఇది స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిపింది. 'నెట్‌ఫ్లిక్స్', 'జియో హాట్‌స్టార్' వేదికగా 'ధురంధర్' మొదటి భాగం అన్‌కట్ వెర్షన్ మే 22 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించింది. 3.25 గంటల నిడివితో పార్ట్ వన్ అన్‌కట్ వెర్షన్ ఆకట్టుకోనుంది. ఇక ఇండియాలో 'ధురంధర్' రెండో భాగం జూన్ 4 రాత్రి 7 గంటల నుంచి జియోహాట్‌స్టార్ వేదికగా అందుబాటులోకి రానుంది. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. మిగిలిన దేశాల్లో సినీ అభిమానులు ఈ మూవీని 'నెట్‌ఫ్లిక్స్' వేదికగా చూడొచ్చు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్యధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ దాదాపు రూ.1800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఓటీటీలో అదనంగా కొన్ని సన్నివేశాలను జోడించారు. థియేట్రికల్ రన్ 3 గంటల 49 నిమిషాలు కాగా, ఓటీటీ వెర్షన్ 3.52 నిమిషాలు.

## వాటికన్ సిటీలో నయన్-విఘ్నేశ్



క్యూట్ కపుల్ నయనతార- విఘ్నేశ్ శివన్ వెకేషన్‌కు వెళ్లారు. సినిమా విరామ సమయాల్లో టూర్స్‌కు వెళ్లే వీరిద్దరూ తాజాగా వాటికన్ సిటీ వెళ్లినట్లు సోషల్ మీడియాలో వెల్లడించారు. పిల్లలతో కలిసి దిగిన ఫొటోలను పంచుకుంటూ 'నాకెంతో ఇష్టమైన వాటికన్..'అని నయనతార క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

## 'విరోష్' వెడ్డింగ్..
## ఆసక్తికర విషయం చెప్పిన ఈవెంట్ ఆర్గనైజర్

విజయ్ దేవరకొండ రష్మిక (విరోష్) వివాహం ఫిబ్రవరిలో ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ వివాహ వేడుకకు సంబంధించి ఈవెంట్ ఆర్గనైజర్ ప్రియ మాగంటి తాజాగా ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. మంగళసూత్రాన్ని రష్మికే డిజైన్ చేసుకున్నారని తెలిపారు. ట్రెండ్‌ను ఫాలో కావాలని విరోష్ జోడీ ముందు నుంచీ అనుకోలేదన్నారు. దుస్తులు, ఆభరణాలు.. ఇలా అన్నీ రొటీన్‌కు భిన్నంగా ప్లాన్ చేశారని చెప్పారు. డ్రెస్సింగ్ విషయంలో రష్మిక ఆరెంజ్ కలర్‌కు ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. ఈ వెడ్డింగ్‌కు సంబంధించి రష్మిక మేకప్ ఆర్టిస్ట్ తన్వీ కూడా ఇటీవల పలు విశేషాలు పంచుకున్నారు. ఎక్కువ మేకప్ వద్దని సూచించిన నటి తమకు 40 నిమిషాల సమయమే ఇచ్చారని తెలిపారు. అయితే ఆ టైమ్‌లో పూర్తి కాలేదని, 90 నిమిషాల సమయం పట్టిందన్నారు. 'నేను ఇప్పుడు ఎలా ఉన్నానో.. పెళ్లిలోనూ అలాగే కనిపించాలి. సహజత్వం ఉండాలి' అని రష్మిక సూచించినట్టు తెలిపారు. సినిమాల విషయానికొస్తే.. ఇప్పటికే



'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్'లో జంటగా నటించిన విజయ్, రష్మిక ఇప్పుడు 'రణబాలి'లో నటిస్తున్నారు. రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం.. సెప్టెంబరు 11న విడుదల కానుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.